# ప్రజ్ఞావతార కథామృతము

భగవత్ కథామృతమహిమను, మహత్యమును అందరూ స్వీకరిస్తారు. నాలుగు వేదాల సంకలన-సంపాదన, వాటి గహన అనుశీలన తర్వాత కూడా ఆత్మవికాసము, ఆత్మికశాంతి మహర్షి వ్యాసునకు లభించనప్పుడు తన వ్యథను ఆయన దేవర్షి నారదునకు విన్నవించుకున్నాడు. జీవన విద్యా మర్మజ్ఞుడైన నారదుడు ఆయనను సమాధాన పరుస్తూ ఇలా అన్నాడు.

సంవేదనల స్వరూపమే జీవితము. సంవేదనల అంకురణ (శ్రవణం), ప్రస్ఫుటన (కీర్తనం), అభివర్ధనకు (స్మరణం) అనుగుణ్యంగా జీవితవికాసము జరుగుతుంది. సంవేదనాహీనుడు జీవించి ఉన్నా మృతుడే. బాహ్య కళేబరము ఏంత విశాలముగా ఉన్నా దుష్ప్రవృత్తుల నిష్కరుణ దుర్గంధము వీరివల్ల సర్వత్రా వ్యాపిస్తూనే ఉంటుంది. ఈ దుర్గంధమును సుగంధముగా మార్చుటకు,సత్ప్రవృత్తుల రూపము ఇచ్చుటకు, జీవచ్ఛవాలలో ప్రాణ సంచారము చేసే నిర్మల సంవేదనల స్రోతము(source)భగవత్కథ. **భగవత్కథ ఒక పరుసువేది.** దీని స్పర్శతో-

**వాసనలు-సాధనా విధానముగా,**

**కుతర్కముల సముహము-సజల శ్రద్ధ**గా.

**సంశయాకుల చిత్తవృత్తులు-కదల్చలేని, సుస్థిర విశ్వాసముగా**

పరిణతి చెందుతాయి.

భగవత్ కథామృతాసించన, వ్యధతో కాళ్ళు, చేతులు కొట్టుకుంటు జీవించే వారిలో మధుర శాంతి, అపరిమిత ఆనందమును నింపుతుంది.

భగవత్ కథ యొక్క ఈ మహిమను భక్తజనులేకాక నేడు మనీషులు, మనోవైజ్ఞానికులు కూడా ఒప్పుకుంటున్నారు. సైకాలజి విత్ ఎ సోల్ "(Psychology with a soul )" గ్రంథకర్త జీన్ హార్డి(Jean Hardy) ఇలా అంటున్నారు.

వ్యక్తి యొక్క ఆలోచనలు, సంస్కారాలే అపరాధాలు, పాపకృత్యములకు ప్రేరక తత్వములు. సత్ సాహిత్య పఠనము, స్వాధ్యాయము వల్ల ఆలోచనలలో మార్పు వస్తుంది. కాని సంస్కారాలు చాలా లోతున పాతుకుని ఉంటాయి కనుక అవి అంత సులభముగా మారవు. మహాపురుషుల ఉదాత్త జీవితము, భావపూరితమైన ఘటనా-ప్రసంగములను చదవడము, వినటము జరిగినపుడు లోతుగా పాతుకుపోయిన మొండి కుసంస్కారములు సహజంగానే కరగటం మొదలెట్టుతాయి. ఆంతరంగ, బహిరంగ జీవితములో ఆశ్చర్యజనకమైన మార్పులు సాకారమవుతాయి.

దీనినే గీతాచార్యుడు బుద్ధియోగము అన్నాడు. శ్రీకృష్ణభగవానుడు తన భక్తుల స్వభావము, వారికి తను ఇచ్చే వరదానముల గురించి ఇలా చెప్పాడు.

మచ్చిత్తా మద్గతప్రాణ బోధయంతః పరస్పరం ।
కథయంతశ్చమాం నిత్యంతుష్యంతిచ రమంతిచ ॥
తేషాం సతతయుక్తానాం, భజతాంప్రీతి పూర్వకం ।
దదామి బుద్ధియోగం తం, యేన ముపయాంతితే ॥

మచ్చితా – చిత్తము నాలోనే నింపుకొని.

(మనస్సు, బుద్ధి, చిత్తము, అంహకారము పూర్తిగా అర్థము చేసుకోవాలి.)

మద్గతప్రాణా – నాలోనే ప్రాణమును సంచరింపచేస్తూ.

(ప్రాణము అనగా కదిలే ఆకాశము. దాని లక్షణాలు, ముఖ్యముగా పంచవిధప్రాణాలు వాటి క్రియా కలాపాలు, నాడులలో ప్రవాహ విధానాలు తెలుసుకొవాలి).

బోధయంతః పరస్పరం – ఒకరికొకరు ఎలా జీవించాలో భోదించుకుంటూ.

కధయంతశ్చమాం నిత్యం – నా గురించే నిత్యము చెప్పుకుంటూ.

( పానియంబుల్ త్రావుచున్ గుడుచుచున్ భాషించుచున్
హాసలీలా నిద్రాదుల్ సేయుచున్ తిరుగుచున్ లక్షించుచున్
సంతత శ్రీనారాయణ పాదపద్మయుగళీభూత చింతామృత స్వాదసంధానుడై
మరిచెన్ సురారి సుతుడేతద్విశ్వమున్ భూవరా.)

తుష్యంతిచ రమంతిచ – తుష్టి చెంది ఆనందముగా ఉంటారు.

తేషాం సతతయుక్తానాం – ఈ విధముగా నాతోనే కలిసి ఉన్న వారికి, (సర్వ ధర్మములను, త్యజించి నిష్కామ కర్మ యోగసాధన చేస్తు కరిష్యే వచనం తవ అని పూర్ణ శరణాగతి చేయాలి)

భజతాం – భజించేవారికి.

(science of service – సేవా విజ్ఞానము తెలిసిన వారికి, మానవసేవ భగవంతుని సేవ అన్న విజ్ఞానము తెలిసిన వారికి)

ప్రీతిపూర్వకం – ఇష్టమై చేసేవారు.

(లాభము, పేరు కొరకు కాదు.)

దదామి బుద్ధియోగం – వారికి నేను బుద్ధి యోగము ఇస్తాను.

(ఆత్మ–బుద్ధి–మనస్సు త్రిభుజము నుంచి శక్తి అవతరణతో జీవాత్మ (Ego) జాగృతమై, భౌతిక, కామ, సరూపా మనస్సుల నియంత్రణ జరిగి విజ్ఞానమయ కోశ జాగరణ జరగాలి. శ్రీఅరవిందుల ప్రకారము అన్నమయ పురుష, కామమయ పురుష, మనోమయపురుష దాటి అతి మానస అవతరణ (supra mental descent) వల్ల విజ్ఞానమయ పురుషుడు సాధకుని జీవితాన్ని తన చేతిలోకి తీసుకొవాలి.)

యేన ఉపయాంతితే – అందువల్ల వారు నన్ను పొందుతారు.

భగవత్కథకి అనేక రూపాలు ఉన్నాయి. దానికి ఎదురు లేదు. ప్రంచములోని విభిన్న దేశాలలో, విభిన్న ధర్మాలలో, విభిన్న సముదాయాలలో దీని స్వరూపము వేరు వేరుగా ఉన్నా దీని ఉనికి సర్వత్రా ఒకే లాగ ఉన్నది. అవతారాలు–పైగంబరుల లీలలు ఎక్కడ ఏవిధముగా చెప్పుకొనబడుతున్నా అవి అందరిని ఆనంద సాగరములో ముంచి వేస్తాయి. దీని ప్రతీ రూపము ఆహ్లాదకరమైనదే, ప్రతి రంగు మనోహరమైనదే. భగవత్కథలు ఎన్ని ఉన్నాయి అంటే వాటిని లెక్క పెట్టలేము. అందుకే గోస్వామి తులసిదాస్ ఇలా అన్నారు. ‘ **హరి అనంత్, హరి కథా అనంతా**’.

భగవంతుడు తన అనంత రూపాలతో యుగానికి అనుగుణ్యంగా తగిన రూపాన్ని ధరిస్తాడు. వీటినే పురాణాలలో దశావతారాలుగా చర్చించారు. ప్రతి అవతార ఉద్దేశ్యము ఒకటే-యుగపరివర్తన. యుగపరివర్తన యొక్క ఈ ఉద్దేశ్యము మరియు ' **సంభావామి యుగేయుగే** ' అనే తన శాశ్వత సంకల్పాన్ని నేరవేర్చుటకు ఈశ్వరీయ చేతన '**శ్రీరామ శర్మ ఆచార్య**' గా నేడు అవతరించినది.

మన పూజ్యగురుదేవులు ఆ శాశ్వత సత్తా ప్రతినిధిగా మన మధ్యకు వచ్చారు. ఆయన జీవనగాధ, వారి లీలా ప్రసంగాల చర్చ మనందరికి చాలా ఇష్టం. ఆయన స్మరణ మాత్రమే మన భావాలను, ఆలోచనలను, శ్రద్ధా-విశ్వాసముల నిర్మల సరోవరములో ముంచేస్తాయి. ఈ లీల ప్రసంగాల చర్చ పూజ్యగురుదేవులు వ్రాసిన '**సున్‌సాన్‌కే సహచర్**' (ఏకాంత సహచరులు), '**హమారీ వసీయత్ ఏవం విరాసత్**' (ఆత్మకథ) పేజీలలో లభిస్తాయి. 90వ సంవత్సర అంఖడ జ్యోతి స్మృతి అంకంగా, తరువాత సంవత్సరాలలో విశేష లేఖామాలగా ఈ పుణ్యస్మరణయే కొనసాగించబడినది. ఆయన లీలా సహచరి వందనీయ మాతా భగవతీ దేవి పుణ్య గాధ వారి మహా ప్రయాణానంతరము అంఖడ జ్యోతిలో మాతృస్మృతి అంకంగా ముద్రించబడినది. వీటితో పాటు గాయత్రీ తపోభూమి, మధుర ద్వారా '**ప్రజ్ఞావతార్ హమారే గురుదేవ్**' అనే పుస్తకములో మన ఆరాధ్యుని జీవితములోనే అనేక కోణాలు తెలియచేయబడ్డాయి. గురుదేవులు, ఆయన అభిన్న శక్తి వందనీయ మాతాజీ శరీరములోనే ఉన్నట్లు కనిపించినా ఈ ఋషి-యుగ్మ జీవితములో సరస రహస్యమయ ప్రసంగాలు అనేకము. నిత్యము వారి యొక్క ఏదో ఒక కొత్త రూపము దర్శనమిస్తూనే ఉంటుంది. అద్వితీయమైన మర్యాదా పురుషోత్తముడైన రాముని, సీతా మాతల లీలా చరిత్రలు ఎప్పటికి పరిసమాప్తి చెందవు. మహార్షి వాల్మీకితో ప్రారంభమైన ఈ కథాస్రవంతి కంబన, మొల్ల, తులసీ, కృతివాస్ మొదలగు అనేకుల స్నానఘటముల ద్వారా ప్రవహిస్తు ఈనాడు కూడా అనేక క్రొత్త రూపాలను సంతరించుకుంటున్నది. ప్రజ్ఞావతార కధామృతము కూడా అలాంటిదే. ఇంతవరకు చెప్పబడినది, తెలియచేయబడినది అల్పమే. ఇక ముందు చెప్పబడేదికూడా స్వల్పమే, అపూర్ణమే. ఇదే దీని ముఖ్య లక్షణము, విశేషత. దీని స్వల్పస్పర్శ ఏ భక్త హృదయాన్ని అయినా క్షుద్రత్వము నుండి గొప్పతనమునకు, అపూర్ణత నుంచి పూర్ణతగా మార్చుటకు సామర్ధ్యము కలది. ఈ భావానుభూతితో పరమపూజ్య గురుదేవుల, వందనీయమాతాజీల జీవనగాధలు, వారిలీలా ప్రసంగాల సంకలన, వారి స్నేహిల సంతానమునకు అందచేయబడుచున్నది. దీని ద్వారా మనందరి జీవితాలలో గురుతత్వ రహస్యోద్ఘాటన జరిగి అంతఃచేతనా సరోవరములో ఈశ్వర ప్రేమ కమలాలు వికసిస్తాయి అని ఆశిస్తున్నాము. వాఙ్మయము యొక్క ప్రధమ ఖండములో ఈ వివరణ వలన పరిజనులు ఋషియుగ్మ రూపమైన గురుసత్తా వ్యక్తిత్వాన్ని బాగా అర్ధము చేసుకొని తమ జీవితాలను ధన్యము చేసుకోగలుగుతారు.

# యుగపురుషుని జీవన వృత్తాంత ప్రస్తావన

పరమపూజ్య గురుదేవులు **పండితశ్రీరామశర్మ ఆచార్య** పరిజనులు ఎంత వేడినా తన జీవిత అంతరంగ విషయాలు 1970-71 వరకు ఎప్పుడు తెలుపలేదు. ఆయన జీవితము ఎంతో సరసముగా, పారదర్శకముగా ఉండేది అంటే, అందరూ ఆయనను తమకు అభిన్న ఆత్మీయ, సొంత వ్యక్తిగా భావిస్తారు. ఆయన ఎవరు? ఏమిటి? ఎంత పెద్ద సంకల్పముతో వచ్చారు? ఈ వివరాలు ఆయన సాహిత్యాన్ని మనన చేసి, ఆయన ప్రాణచేతనమైన 'అఖండజ్యోతి' పత్రికను మనస్పూర్తిగా స్వాధ్యాయము చేసిన వారే తెలుసుకొనగలరు. పూజ్య గురుదేవులు, తన సహధర్మచారిణి **మాతా భగవతీదేవిని** తనవలే మలచుకున్నారు. వారిరివురి ప్రతిశ్వాస లోకహితమునకే సమర్పింపబడినది. వీరు ఏ వటవృక్ష బీజారోపణ ఒక మిషన్‌గా చేశారో అది విశాల స్వరూపము దాల్చి ఈనాడు ప్రపంచమంతట విస్తరిస్తోంది. సమాజములో అందరి ముందుకు వచ్చింది. గాయత్రీ-యజ్ఞము ఆధారముగా తపోమయ బ్రాహ్మణుని జీవితము జీవిస్తూ నేడు జర్జర స్థితిలో ఉన్న సమాజానికి నూతన భవ్య, దివ్య రూపము ఎలా ఇవ్వవచ్చో పరిజనులు, పాఠకులు తెలుసుకొనగలుగుతారు. అక్కడక్కడ ఘటనాక్రమము ద్వారా వారి కరుణతో నిండిన అంతఃకరణమును దర్శిస్తే, దుష్ప్రవృత్తులు, మూఢ-మాన్యతలతో పోరాడే వీరుడుని దర్శిస్తాము. పూర్తి జీవన వృత్తాంతమును విభిన్న ఖండములుగా విభజించాము. ఇందులో అనేక సంఘటనలు భిన్న భిన్న శైలిలో అనేకచోట్ల వర్ణించబడ్డాయి. కాని ఇవి అనవసరమైన రిపిటిషన్ (పునరావృత్తి) కాదు. వీటిని మేము తప్పించలేకపోయాము. ఇవి లేకపోతే వివరించబడుతున్న ప్రసంగమును పూర్తిగా హృదయంగమము చేసుకోలేము. ఉదాహరణకు, సహస్రకుండీ యజ్ఞము, మధుర (1958) యొక్క వివరణ, దాదా గురుదేవులతో కలయిక - సాక్షాత్కారము, యుగపరివర్తనకు సంబంధించిన సందేశాలు (ఘోషణలు), వారి హిమాలయయాత్రలు, సూక్ష్మీకరణకు సంబంధించిన గుహ్య ప్రసంగాలు, వేరువేరు చోట్ల విభిన్న శైలి (శబ్దావళి) లో వర్ణింపబడ్డాయి. వాటిని ఆ ప్రసంగాలతో కలిపి అర్థము చేసుకొనే ప్రయత్నం చేయాలి. సమయావధిలో (chronological) బహుముఖీ విలక్షణ లేని వారి గురించి వ్రాయగలము. కాని ఎవరైతే 5-5 జీవితాలను ఒకేసారి జీవించారో, 80 సంవత్సరాలలో 800 సంవత్సరాల పని ఒంటరిగా సాధించారో, ఒక అసంభవమైన పురుషార్థము తమ సహధర్మచారిణి శక్తి స్వరూపా వందనీయ మాతా **భగవతీదేవిశర్మ** ద్వారా సంపన్నము చేయించారో, వారిరువురు కలిసి ఒకే ప్రాణమై, ఒక మిషన్‌గా లక్షలాది సృజన శిల్పులకు తమ మానస సంతతిగా జన్మనిచ్చి ఒక అభూతపూర్వ కార్యమును చేయించారో, ఋషి-యుగ్మ మహాప్రయాణము తరువాత కూడా ఈ కార్యము ఇంకా నిరంతరము విస్తృతము అవుతూ ఉంటే, శిష్య సముదాయము ఒకవిరాట్ జనసముదాయముగా పరిణతి చెందుతూ ఉంటే, వారి జీవిత క్రమము ఒక సమయావధిలో (chronological) ఎలా బంధించి వ్రాయగలము. అందువలన పాఠకులు అక్కడక్కడ కాల-సీమ బంధనము తెంచుకొని వీరి జీవితక్రమమును కథామృతముగా చదివితే భగవత్కథామృతపాన లాభము పొంద గలుగుతారు.

పరమపూజ్య గురుదేవులు, గాయత్రీ తపోభూమి మధురా, వదిలి హిమాలయాలకి 1970-71 లో వెళ్ళేటప్పుడు వీడ్కోలు సమారోహములో తమ అంతఃవేదనను అఖండజ్యోతిలో '**అపనోంసే అపనీబాత్**' (నా వాళ్ళతో నామాట) లో వ్యక్తంచేశారు. '**హమారీజీవన్‌సాధనాకే అంతరంగ పక్ష-పహులు,** నా జీవన సాధన

యొక్క అంతరంగ స్వరూపము) అనే పేరుతో మొట్టమొదట ఆత్మకథా ప్రధానమైన వ్యాసము జనవరి 1971 అఖండజ్యోతి పత్రికలో వ్రాశారు. దీని ఉత్తరార్ధము ఫిబ్రవరి 1971 అఖండజ్యోతిలో **'హమారేదృశ్య జీవన్‌కి అదృశ్య అనుభూతియా'** (నా దృశ్యజీవిత అదృశ్య అనుభూతులు) గా తెలిపారు. ఈ రెండు వ్యాసాలను ఈ ఖండము మొదటిలోనే ఇచ్చాము. చదివి ఈ **సంత్**, **ఆత్మజ్ఞాని**, సిద్ధపురుషుణి అంతఃకరణమును, వ్యధను, అర్ధము చేసుకోగలరు. సమగ్ర జీవన వృత్తాంతము ఆయన దార్శనికుని శైలిలో జూన్ 1984 విశేషాంకముగా తరువాత ఏప్రియల్ 1985 అఖండజ్యోతిలో జీవనగాధా, విశేషాంకముగా సూక్ష్మీకరణ అవధిలో వ్రాశారు. ఇవి అన్ని సంకలితమై ఆయన ఆత్మకథగా కూర్చబడి '**హమారీ వసీయత్ ఔర్ విరాసత్**' గా అందచేయబడినది. కాని ఇంతకు ముందే '**చమత్కారోంసే భరా జీవన్‌క్రమ్ ఏవం ఉన్‌కీ మర్మ**' (చమత్కారములతో నిండిన నా జీవిత క్రమము దాని మర్మము) ఫిబ్రవరి, మార్చి 1985 అఖండజ్యోతి పత్రికలో వ్రాసారు. పరిజనులు బాల్యము నుంచి ఇప్పటి వరకు జీవన వృత్తాన్ని విస్తారముగా తెలుపమని వత్తిడి చేస్తే, ఏప్రియల్ 1985 పత్రిక వ్రాయబడినది.

పరమపూజ్య గురుదేవుల జీవన వృత్తాంతాన్ని సమగ్రముగా అర్ధము చేసుకోవాలి అనుకునేవారికి ఈ నాలుగు వ్యాసాలు చాలా ముఖ్యము. అప్పుడే ఆయన పూర్తి స్వరూపము అవగాహనకు వస్తుంది. ఆయన జీవనవృత్తాంతమును ఆరంభించే ముందు ఆయన జీవితానికి సంబంధించిన, ఆయన వ్రాసిన వ్యాసములనే మీకు అందిస్తున్నాము. దీనివల్ల ఆయన విరాట్ వ్యక్తిత్వ అంతరాళాలలో దాగివున్న ఆత్మసత్తాను దర్శించి, ఆయన సంవేదనల, ఆయన మూలాధార ఆలోచనల మూర్తి స్వరూపమైన మిషన్‌ను (mission) అర్ధం చేసుకోగలరు.

# నా జీవన-సాధన యొక్క అంతరంగ విశేషాలు

## జనవరి, 1971 అఖండజ్యోతి

చాలా మంది పరిజనులు నా సాధన, దాని ఫలితాలు గురించి విశదముగా తెలుసుకోవాలి అనుకుంటారు. ఇది స్వాభావికమే. నా భౌతిక స్థూలజీవితములో బహిర్గతమైన అంశాలు లోకుల దృష్టిలో అద్భుతమైనవి. వానిలో రకరకాల సిద్ధులు, చమత్కారాలు, అలౌకికమైన సంఘటనలను గమనించవచ్చు. వాటి వెనుక ఉన్న రహస్యాలను తెలుసుకోవాలి అనే ఉత్సాహము స్వాభావికమే. అందువల్ల పరిజనులు నా ఆత్మకథ తెలుసుకోవాలి అని ఈ రోజులలో నన్ను బలవంతము చేయుట అకారణము కాదు.

నేను ఎప్పుడు ఏది దాచి పెట్టాలి అనుకోలేదు. మోసగించుట, కపటము నాకు అలవాటు లేదు. నావివశత ఏమిటంటే ప్రపంచ నాటకరంగములో నా పాత్ర ప్రత్యక్షముగా, శారీరకముగా ఉన్నప్పుడు వాస్తవాన్ని తెలుపుతే, దర్శకుల దృష్టి ఇంకొక దిశకి మళ్ళుతుంది, అందువల్ల ఆదర్శాల కొరకు ఏ కర్తవ్యనిష్ఠను నేను అందరిలోను జాగృతము చేయదల్చుకున్నానో ఆ ప్రయోజనము సిద్ధించదు. వ్యక్తులు ఈ రహస్యాల జంజాటములో ఇరుక్కుంటారు. అందువల్ల నా వ్యక్తిత్వము కూడా వివాదాస్పదము అవుతుంది. అప్పుడు నేను ఏమి చెయ్యాలో, ఇతరుల చేత ఏమి చేయించటానికి నేను పంపబడ్డానో, దానికి చాలా అవరోధాలు ఏర్పడతాయి. నిస్సందేహముగా నా జీవితం అలౌకికతలతో నిండిఉంది. నా జీవితములో రహస్యమయ తెరలు ఎన్ని ఉన్నాయి అంటే సమయానికి ముందే వాటిని ఎత్తితే చాలా అరిష్టాలు సంభవిస్తాయి. అందువల్ల **నా తరువాత వచ్చేవాళ్ళకి** నా జీవితాన్ని ప్రమాణికత అనే గీటురాయితో అన్ని విధాల, అన్ని కోణాలలో పరిక్షించి ఆధ్యాత్మిక విద్య ఏంత సమర్థమైనదో, ఎంత సారగర్భితమైనదో, **నిరూపించే భాద్యత అప్పగిస్తున్నాను.** ఈ పరుసువేది స్పర్శతో ఒక అతి సాధారణ వ్యక్తి తన తుచ్ఛ కాయ కళేబరములను స్వర్ణము వలే బహుమూల్యముగా చేసుకొనుటలో ఎలా సమర్థుడు అయ్యాడు, ఎలా సఫలత పొందాడో తెలుసుకుంటారు. ఈ దృష్టితో నా జీవితములోని అనేక రహస్యమయ సంఘటనలను సమయము వచ్చినప్పుడు పరిశోధనలు చేయవచ్చు. అప్పుడు ఈనాడు నాకు చాలా దగ్గరగా ఉన్న పరిజనులు కొంత సహాయపడవచ్చు. దానికి ఇంకా సమయము ఉన్నది. అందువల్ల వాటిమీద తెరలు ఇంకా అలాగే వేసి ఉండాలి.

ఆత్మకథ వ్రాయమని అడిగే వారికి నా సాధనాక్రమము ఎలా నడిచినదో మాత్రమే తెలుపగలను. **వాస్తవానికి నా ఉపలబ్ధులన్ని ప్రభు సమర్పిత సాధనాత్మక జీవిత విధానము మీద ఆధారపడినవే.** దీనిని తెలుసుకొనగలిగితే ఆధ్యాత్మిక జీవితము మీద ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరికి, ఆత్మిక ప్రగతి, దానివల్ల లభ్యమయ్యే విభూతులు పొందే ఆనందమయ మార్గము సులభము అవుతుంది. నా కలము ద్వారా పాఠకులు ఇంత మాత్రమే పొందగలరు. దానితోనే సరిపెట్టుకొవాలి.

నా 60 సంవత్సరాల జీవితములో మొదటి 15 సంవత్సరాలు అందరివలె సాధారణముగా గడిచినవి. తరువాత 45 సంవత్సరాలు ఆధ్యాత్మిక ప్రసంగాలను నాజీవితములో కలుపుకుంటూ గడిపాను. ఈ ప్రయోగాలలో పూజ - ఉపాసనాల పాత్ర చాలా తక్కువ. రోజుకి 6 గంటలు చొప్పున 24 సంవత్సరాల గాయత్రీ ఉపాసన కంటే దానితో పాటు జోడించబడిన మానసిక పరిష్కారము, భావనాత్మక ఉత్కృష్టత అభివర్ధన ప్రయత్నాలకు ప్రాముఖ్యత ఇవ్వాలి. విచారణ మరియు కార్యపద్ధతిని పరిష్కృతము

చేసుకొని ఉండకపోతే నా ఉపాసనా కర్మకాండ కూడా అనేకుల మంత్ర – యంత్రములతో కూడిన పూజా – ఉపాసనల వలె నిరర్ధకము అయి ఉండేది. నా జీవనసాధన, మీరు సఫలము అనుకుంటే, దానిలోని అలౌకికతకు కారణాలు వెతుక్కుంటే, దానికి ప్రధాన కారణము అంతరంగ, బహిరంగ స్థితుల పరిష్కారమే అని తెలుసుకోవాలి. పూజ – ఉపాసన గౌణము. ఆత్మకథ యొక్క ఒక అంశము వ్రాసే, దుస్సాహసము చేస్తూ నేను ఒకే తథ్యమును ప్రతిపాదిస్తున్నాను. **నా పూర్తి మనోయోగమును మరియు పురుషార్ధమును ఆత్మశోధనకే వెచ్చించాను. నా ఉపాసనను కూడా భావపరిష్కార ప్రయత్నాలతో పూర్తిగా జోడించాను.** ఇక పాఠకులకు తెలియడానికి నా సాధనా విధానాలు చెప్తాను.

ఆధ్యాత్మిక జీవితానికి మూడు మెట్లు ఉన్నాయి.

**1. మాతృవత్ పరదారేషు,**

**2. పరద్రవ్యేషు లోష్టవత్,**

**3. ఆత్మవత్ సర్వభూతేషు.**

ఈ మూడింటిని అధిరోహిస్తూ సుదూర లక్ష్యాలను పొందాను.

**1. మాతృవత్ పరదారేషు, 2. పరద్రవ్యేషు లోష్టవత్,** ఈ మజలీలు వ్యక్తిగతమైన సాధనలు. ఇవి నాతో నేనే యుద్ధం చేసుకొనుట, నా ఇంటిని నేనే చక్కబరచుకొనే ప్రయత్నాలు. పూర్వజన్మ సంస్కారాలు, సమర్ధగురుని సహాయముతో సులభంగానే సాధించగలిగాను. నన్ను కుమార్గము వైపు లాక్కెళ్ళే ధైర్యము చేయటానికి నా మనస్సు అంత మొండిదికాదు, చెడ్డదికాదు. అప్పుడప్పుడు కొంచెము మార్గము నుంచి తప్పుకోవడానికి ఊహ వచ్చినా, ఒక గట్టి దెబ్బ వేస్తే దారికి వచ్చేది. మనస్సును ఇలా నియంత్రణ చేసుకొనుట వల్ల పాపము, పతనము నుంచి కూడా తప్పించుకోగలిగాను. ఇక ఇప్పుడు అన్ని రకాల ప్రమాదాల నుంచి తప్పించుకున్నాను గనుక, హాయిగా ఊపిరి పీల్చుకోగలుగుతున్నాను. కబీరుదాసు అతి పల్చగా పారదర్శకమైన దుప్పటి అల్లాడు, ప్రయత్న పూర్వకంగా దానిని కప్పుకున్నాడు, దానికి ఏ విధమైన మరకలు, మచ్చలు అంటకుండా తిరిగి ఇచ్చివేశాడు. నన్ను ఆ మార్గంలోనే నడిపించిన పరమాత్మకు అనేక ధన్యవాదాలు. ఆ పదచిహ్నములను వెతుక్కుంటూ ఆ ఆధారాలను గట్టిగా పట్టుకొని ఇక మార్గచ్యుతుడయ్యే ప్రమాదము లేని స్థితికి చేరుకున్నాను.

ఆధ్యాత్మికత యొక్క కర్మకాండలు అంత కష్టమైనవి కావు. ధృడమైన సంకల్ప బలము ఉండి శ్రద్ధ – నిష్ఠ తగ్గకపోతే మానసిక ఉద్విగ్నత ఉండదు. ఉపాసన విధివిధానము కూడా దారి తప్పకుండా సాఫీగా నడచిపోతుంది. ఒక సాధారణ వ్యాపారి, ఒకే దుకాణములో, ఒకే విధముగా తన పూర్తి జీవితాన్ని ఆనందంగా గడుపుతాడు. అతని మనస్సుకి అది బోరుకొట్టదు, అయిష్టం అనిపించదు. కిళ్ళీ, సిగిరెట్టు అమ్మేవారు రోజుకు 12–14 గంటలు తమ వ్యాపారాన్ని ఉత్సాహంతో శాంతి పూర్వకంగా చేసుకొంటారు. అటువంటప్పుడు 24 సంవత్సరములు రోజుకు 6–7 గంటలు గాయత్రీ సాధన చేసే సంకల్పమును నేను ఎందుకు నెరవేర్చలేను? ఉపాసన, – కిళ్ళీ, బీడీలు అమ్మటం, స్వీట్స్ అమ్మటం, వ్యవసాయం చేయుటకంటే తక్కువ లాభదాయకము, అనవసరము అనుకునే వారికే ఉపాసనలో మనస్సు లగ్నం కాదు. అనవసరం అనిపించే అరుచికరమైన పనులలో మనస్సు నిలవదు కదా?

ఎవరి ఆంతరిక ఆకాంక్ష, భౌతిక సుఖసాధనాలే అంతా అనుకుంటుందో వారికి ఉపాసనలో విసుగు, అరుచి అనే అడ్డంకులు వస్తాయి. ఎవరైతే పూజా-ఉపాసనల ద్వారా కోరికలు తీర్చుకోవాలి అనుకుంటారో, వారే ప్రారబ్ధ పురుషార్థ న్యూనతవల్ల కోరుకున్న వరదానాలు లభించకపోతే, నిరాశ నిస్పృహలకు లోనవుతారు. మొదలు పెట్టినప్పుడే ఆకాంక్షలకు ప్రతికూలమైన పనిలో ఉత్సాహము ఉండదు. ఎక్కువ మంది ఈ స్థితిలోనే ఉంటారు కనుక వారి మనస్సు నిలకడగా ఉండుటలేదు అని ఫిర్యాదు చేస్తారు. కాని నా స్థితి వీరికంటే భిన్నమైనది. శరీరము సాధనకు ఒక పనిముట్టు అనుకున్నాను. వస్తువులను జీవించటానికి అవసరమైన ఇంధనములుగా మాత్రమే ఉపయోగించాను. గొప్పవాడిని అవ్వాలని, పేరు తెచ్చుకోవాలి అనే మహత్వాకాంక్ష నాకు ఎప్పుడు రాలేదు. నేను ఆత్మను అని నిరంతరము గుర్తుంచుకొనుట వల్ల ఆత్మోత్కర్షకు, ఆత్మ కళ్యాణము కొరకు, ఆత్మశాంతి కొరకు, ఆత్మవిస్తారము కొరకు ఎందుకు ప్రయత్నించకూడదు అని అనిపించేది. ఎప్పుడైతే శరీరమును, నన్ను వేరు-వేరుగా చూసుకోగలిగానో శరీరము యొక్క స్వార్థమును, నా స్వార్థమును వేరుగా చూడగలిగానో అజ్ఞానము యొక్క ఒక పెద్ద అడ్డుగోడ కూలిపోయింది. చీకటిలో వెలుతురు ఆవిర్భవించింది.

ఎవరైతే తాను శరీరము అని అనుకుంటారో, ఇంద్రియాల తృప్తియే ఆనందదాయకము అనుకుంటారో, వాసనా-తృష్ణ యొక్క పూర్తి ఎవరి జీవనోద్దేశ్యమో, వారికి డబ్బు, హోదా, ప్రశంసా, మొదలగునవే సర్వస్వం. వారు ఆత్మ కళ్యాణము గురించి విస్మరించవచ్చు, లోభ-మోహాలనే బంగారు సంకెళ్ళు ఆనందంగా వేసుకొనవచ్చు. వారికి శ్రేయో మార్గం ఆచరించే వీలు లభించలేదు అనే వంక సత్యము కావచ్చు.

**అంతఃకరణ యొక్క ఆకాంక్షలే పరిస్థితులను నిర్మిస్తాయి.** భౌతిక సుఖ-సంపదలే లక్ష్యమైనప్పుడు చేతన యొక్క అన్ని ప్రయత్నాలు దాని కొరకే ఉపయోగపడతాయి. ఉపాసన ఒక చిన్న ఆటగా మారుతుంది. చేసినా పరవాలేదు, చేయక పోయినా పరవాలేదు. ఎక్కువ మందికి ఉపాసన ఒక కుతూహలమే. చిన్న పిల్లల ఆటవలె చేసుకుని ఏ పుట్టలో ఏ పాము ఉందో అనే భావన తప్ప, సంకల్ప బలముండదు. కొంచెము సేపు కూడా మనసు పెట్టకుండా చమత్కారాలు ఆశిస్తూ అడ్డదిడ్డంగా చేసే పూజ-ఉపాసన ఫలించకపోతే విశ్వాసము కోల్పోయి మానివేస్తారు. ఈ పరిణామము సహజమే కదా! నిజమేమిటంటే శ్రద్ధ-విశ్వాసము లేకపోవుట మరియు జ్ఞానోద్దేశ్యప్రాప్తి కొరకు తీవ్రమైన ఆకాంక్ష లేకపోవుట వల్ల ఆత్మిక ప్రగతి పొందలేకపోతున్నారు. ఈ వివరాలన్నీ నాకు పూర్తిగా అర్థమయ్యాయి. కనుక నా శరీరాన్ని పోషించుకొనుటకు మరియు కుటుంబ వ్యవస్థ నడుస్తూ ఉండడానికి కావలసినంత శ్రమ మాత్రమే భౌతిక జీవితంలో నేను తీసుకున్నాను. శరీరాన్ని ఉపయోగించుకోవటానికి అతి ముఖ్యమైన, ఎంత తక్కువ సంభవమో అంత తక్కువ ప్రయత్నాలు శరీర యంత్రానికి బాడుగ ఇచ్చే దృష్టి కోణంతోనే భౌతిక కార్యక్రమాలు చేసుకున్నాను. ధన సంపాదన లక్ష్యం కూడా అంత వరకే దృష్టిలో ఉంచుకున్నాను. నా అంతఃకరణ నిరంతరము లక్ష్య ప్రాప్తి కొరకు ప్రయత్నిస్తూ ఉండడం వల్ల భౌతిక ప్రలోభాలు మరియు ఆకర్షణలో ఇరుక్కునే పరిస్థితి, అవసరం నాకు ఎప్పుడూ రాలేదు.

ఎప్పుడైతే నా స్వరూపమును ఆత్మస్థితిగా గుర్తించానో అంతఃకరణ పరమేశ్వరుని పరమ పవిత్ర నివాస గృహముగా దృగ్గోచరమగుట మొదలెట్టింది. చిత్తము అంతర్ముఖమగుట మొదలెట్టింది. నా యొక్క మొత్తము ఆలోచనా విధానము పరమాత్మ యొక్క రాజకుమారుడైన ఆత్మ ఏమి చెయ్యాలి? ఏ దిశలో వెళ్ళాలి? అనే

ఆలోచనలకు మాత్రమే పరిమితమైనది. ప్రశ్నలు సులభమైనవి, జవాబులు కూడా సులభమైనవి.

**కేవలము ఉత్కృష్ట జీవితమే జీవించాలి. కేవలము ఆదర్శవంతమైన కార్య పద్ధతులే అవలంబించాలి.** ఈ మార్గము మీద నడవలేని వారికి చాలా భయాలు అనిపించి ఏం ప్రమాదాలు వస్తాయో, బీదరికము ఎలాంటి పరిస్థితులను చూపిస్తుందో, కుటుంబ సభ్యుల నుండి ఎటువంటి విమర్శలు ఎదుర్కోవలసి వస్తుందో అనే భయాలు పీడిస్తాయి. నేను కూడా అనేక మంది ఎగతాళి మరియు చేతకాని వాడ్ని అనే కఠోక్తులు సహించవలసి వచ్చింది. కుటుంబ సభ్యులే నాకు ఎక్కువగా అడ్డుపడ్డారు. వారికి నా నుంచి లభించేటటువంటి అనేక భౌతిక లాభాలు లభించవు, వాటిని పోగొట్టుకుంటున్నాము అనే భావనతో నా ఆలోచనలు, కార్య పద్ధతిని మూర్ఖమైనవిగా అన్నారు. కానీ ఇది ఎక్కువ సేపు నన్ను బాధించలేదు. మన నమ్మకము, విశ్వాసము, శ్రద్ధ సుధృడముగా ఉంటే విరోధము ఎంత సేపు ఉంటుంది? చెడు మార్గము మీద నడిచేటప్పుడు మాత్రమే విరోధ తిరస్కారాలు స్థిరంగా ఉంటాయి. మంచితనము వ్యక్తిని మాత్రమేకాక ఇతరులను కూడా రక్షించే విభూతి, శక్తి. దీనికి అడ్డు తగిలే వాళ్ళు, నిందించేవాళ్ళు త్వరలోనే తమ తప్పును తెలుసుకొని అడ్డుతగలడానికి బదులు సహకరించటం మొదలెడతారు. **మన యొక్క ఆస్థా, శ్రద్ధ, విశ్వాసము ఎంత గొప్పగా, స్థిరముగా ఉంటాయో, ఎంత దృఢముగా ఉంటాయో ప్రతికూలత అంత తొందరగా అనుకూలతగా మారుతుంది.** కుటుంబం నుంచి వచ్చే విరోధము ఎక్కువ సేపు నేను భరించవలసి రాలేదు. వారి సందేహాలు వస్తుస్థితి అర్థంకాగానే దూరమై పోయాయి. ఆధ్యాత్మిక జీవితంలో నిజానికి ఎప్పుడు హాని ఉండదు. అప్పుడప్పుడు బాహ్యదృష్టిలో బీదరికం ఉన్నట్లు అనిపించినా-ఇటువంటి వ్యక్తులు ఆత్మిక శాంతి మరియు సంతోషమువల్ల చాల ప్రసన్నంగా ఉంటారు. ఈ ప్రసన్నత మరియు సంతుష్టి ప్రతి ఒక్కరినీ ప్రభావితము చేసి విరోధులను కూడా సహకరించే వ్యక్తులుగా మారుస్తుంది. నా కష్టాలన్నీ ఇలాగే నివారించబడ్డాయి.

గొప్పతనము, పేరుతెచ్చుకోవాలనే ఆకాంక్ష, లోభ, మోహ, తృష్ణల యొక్క సంకెళ్ళు ఎప్పుడైతే నివారించుకో గలిగానో అన్ని రకాల బంధనాల నుండి ముక్తి లభించింది. లోభ-మోహ-తృష్ణలనే ఈ మూడు సంకెళ్ళు వ్యక్తులను భవసాగరంలో బోర్లపడవేసి ముళ్ళ కంచెల మీద లాగుతాయి. అంతేకాక అసంతృప్తి, ఉద్విగ్నతల యొక్క వ్యధా వేదనలతో, మూల్గుతూ ఉంటాడు. ఈ మూడింటిని తుచ్ఛమైనవిగా అర్థం చేసుకోగలిగితేనే లిప్సను, కోరికను శ్రద్ధగా మార్చుకోగలిగితే, మాయ యొక్క బంధనాలు తొలగిపోయి జీవన్ముక్త స్థితి పొందగలము. **'నజరే తేరీ బదిలీకి నజారా బదల్‌గయా'** అనే యుక్తి ప్రకారము నా వ్యక్తిగత భావనలు ఆత్మజ్ఞానము పొందగానే పరిసమాప్తమై జీవన లక్ష్యము పొందాలి అనే ఆకాంక్ష నా వ్రేలు పట్టుకొని మార్గదర్శనం చేయటం మొదలెట్టింది. ఇంక లేమి లేదు. దుఃఖము లేదు. శరీరానికి జీవించటానికి ఎంత అవసరమో అంతే సమకూర్చి సీమిత సాధనలతోనే తృప్తి చెందే శిక్షణ యిచ్చి, లోభ-లిప్సల వేరుకోసేశాను. మనస్సు ఇటు అటు చలించకుండా ఉంటే ఎంత అనంతమైన శక్తి లభిస్తుందో, ఎంత ప్రసన్నంగా ఉంటుందో ఈ తథ్యాలను ఎవరైనా అనుభవించి తెలుసుకోగలరు. కాని ఏమి చేయగలము మనుష్యులందరూ నూనెతో నిప్పును ఆర్పటానికి ప్రయత్నిస్తున్నారు. తృష్ణను ధనముతోను, వాసనలు-కోరికలను భోగముతోను తృప్తి చెందించటానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి ప్రయత్నాలు దావానలాలను మాత్రమే సృష్టిస్తాయని, ఈ మార్గము మీద పయనించేవారు ఎండమావుల భ్రమలో దారి తప్పుతారని, స్మశానాలలో ప్రేత పిశాచాల వలే ఉద్విగ్న మానసికస్థితిలో ఉండి కుకర్మలే చేయగలరని వీరికి అర్థము అయ్యేటట్లు ఎవరు చెప్పగలరు? చెప్పేవాళ్ళు వినేవాళ్ళు ఇద్దరూ దొందుకు దొందే.

సత్సంగము ప్రవచనాలు నేను చాలా విన్నాను. కాని ఆధ్యాత్మికతను అంతరంగములోనికి దింపి అను సరించమని ప్రేరణ ఇచ్చే జ్ఞానులు నాకు దొరకలేదు. ప్రవచనాలిచ్చేవారి జీవన విధానాన్ని జాగ్రత్తగా గమనిస్తే వినేవారి కంటే వారి జీవితాలలోనే ఎక్కువ మాలిన్యాన్ని చూశాను. వారి నుంచి మనస్సు ఎదురు తిరిగింది. పెద్ద పెద్ద సత్సంగాలు, సమ్మేళనాలు జరుగుతూ ఉన్నా కాని నాకు వాటిని చూడటానికి, వినటానికి మనస్సు ఒప్పేది కాదు.

ప్రకాశము నాకు లభించింది. కాని అది నాకు నా అంతరంగము నుండే లభించింది. బయట నుంచి కాదు. నా ఆత్మయే సాహసించి తనచుట్టూ ఉన్న వలను ఛేదించే ధైర్యము ఇచ్చింది. అప్పుడే ఫలితాలు పొందగలిగాను. ఇతరుల మీద ఆధారపడి జ్ఞాని అనిపించుకున్న వారు బహుశా నన్ను గూడ అజ్ఞానిని చేసి ఉండేవారు.

**ఎవరికైనా ప్రకాశము (జ్ఞాన జ్యోతి) లభిస్తే అది ఎప్పుడూ లోలోపల నుంచే లభిస్తుంది అన్నది నాకు అర్థం అయింది.** కనీసము నావరకు యిది తథ్యము అని నిరూపణ అయినది. ఆధ్యాత్మిక ప్రగతిలో పెద్దపెద్ద కొండల వంటి బాహ్య అవరోధాలు, లక్ష్యము మీద నిరంతర శ్రద్ధ ఉండకుండా, శ్రేయో మార్గములో నడిచే సాహసము చేయకుండా, తొలగించుకోలేము. ఈ నిర్ణయము మీద నేను దృఢంగా ఉన్నప్పుడు సహాయకులు నాకు ఎప్పుడూ లభిస్తూనే ఉన్నారు. గురుదేవుల నుంచి భగవంతుడి వరకు అందరూ నా లక్ష్యమును సరళము చేయుటకు నిరంతరము లభిస్తూనే ఉన్నారు. ప్రగతి మార్గములో నెమ్మది నెమ్మదిగా సుదృఢమైన అడుగులు ముందుకు వేస్తూనే ఉన్నాను. ఈనాడు ఉన్న నా స్థితికి ఈ విధి విధానము అవలంబించటం వల్లనే చేరుకున్నాను.

సాధారణంగా చాలా మంది ఆధ్యాత్మిక జీవనము చాలా కష్టసాధ్యము అంటారు. కాని నా వ్యక్తిగత అనుభవము దీని కంటే సర్వదాభిన్నము. నిజానికి వాసనాతృష్ణలతో నిండి ఉన్న జీవితము చాలా కఠినమైనది జఠిలమైనది. ఈ స్థాయిలో జీవించే వ్యక్తి ఎంత శ్రమ పడతాడో, ఎంత బాధ పడతాడో, ఎంత వ్యథావేదనలు సహిస్తాడో, ఎంత గందరగోళం పడతాడో వాటిని చూస్తూ ఉంటే ఆధ్యాత్మిక జీవితములోని కష్టాలు నగణ్యమనే చెప్పవచ్చు. ఇంత శ్రమ, ఇంత బాధ, ఇంత ఉద్వేగము పడినా ఒక్క క్షణము కూడా సంతోషము ఉండదు. కోరికలను తీర్చుకొనుటకు చెప్పలేనంత ప్రయాస, కాని ఆ కోరిక పూర్తి కాకముందే వంద క్రొత్త అభిలాషల సమూహము ఏర్పడుట, ఇవంతా ఎంత గందర గోళము అంటే, అతి పెద్ద సఫలత పొందినా వ్యక్తికి తృప్తి లేదు ,సంతోషము లేదు. ఒక చిన్న సఫలత పొందటానికి ఎంత అలసిపోయే శ్రమ చేయవలసిందో తెలిసినా దాని కంటే పెద్ద సఫలత పొందటానికి నాలుగురెట్లు, పదిరెట్ల బాధ్యత పైన వేసుకుంటారు. గతి తీవ్రమవుతున్న కొద్దీ సమస్యలు ఎక్కువవుతాయి. ఝంజాటము ఎక్కువవుతుంది. వాటిని సవరించుకోవటానికి దేహము, మనస్సు, ఆత్మ యొక్క మొత్తము శక్తి ఖర్చయిపోతుంది. సామాన్య శారీరక మరియు మానసిక శక్తి, సురసలాంటి అభిలాషలను పూర్తి చేయటానికి సమర్థత లేక పోవటం వల్ల అనీతి అనాచార మార్గాలను ఎన్నుకోవలసి వస్తుంది. జఘన్య పాపకర్మలు చేసినా అభిలాషలు, కోరికలు ఎప్పటికి తీరుతాయి? పొందిన ఉపలబ్ధులను, దానికి పడ్డ నిరంతర మానసిక ఉద్వేగము మరియు వాటివల్ల భవిష్యత్తులో రాబోయే ఘోర ఫలితాలు ఈ రెండింటిని కలిపి చూస్తే వాటిని అతి తుచ్ఛముగానే భావించ వలసివస్తుంది. సాధారణ వ్యక్తులు నిరంతరము బాధపడుతూ, ఏడుస్తూ, రోషము, శోకముల బారిపడుతూ, జీవచ్ఛవముల వలె జీవితాన్ని గడుపుతున్నారు.

నిజానికి వీరిని నిజమైన తనస్వులుగా గుర్తించాలి. ఇంత కష్టము, త్యాగము, ఉద్వేగము, ఆత్మిక ప్రగతి మార్గములో భరించ గలుగుతే ప్రతి వ్యక్తి యోగి, సిద్ధపురుషుడు, మహామానవుడు, దేవతే కాక భగవంతుడు కూడా అయిపోగలిగే వాడు. సాధారణ మానవులు పాపము ఏమీ పొందలేరు. చాలా కోల్పోతారు. నిజానికి వీరే నిజమైన త్యాగులు. తపస్యులు. బలిదానము చేసేవారు. ఎందువల్ల అంటే వీరు అత్యధిక పరిశ్రమతో పాపములు మూటుకట్టుకొనే దుస్సాహసము చేయుటయేకాక సంపాదించింది, బంధువర్గానికి ఇచ్చి స్వయముగా ఉత్తి చేతులతో వెళ్ళిపోతారు. అందువల్ల నాకు ఇతరుల సుఖము కోసం స్వయముగా యింత కష్టపడే వారు మహాత్ములు, జ్ఞానులు, పరమార్థీ పురుషులు అనిపిస్తుంది. వీరు తమని తాము మోహగ్రస్తులమని, పాపాత్ములమని, పదభ్రష్టులమని అనుకున్నా వీరు నా దృష్టిలో గొప్పవారే.

నా చుట్టూ ఉన్న అసంఖ్య మానవ దేహధారుల యొక్క అంతరంగ బహిరంగ జీవితమును చూస్తే వీరందరి కంటే ఎక్కువ సుఖమయమైన, ఆనందదాయకమైన జీవితము నేను జీవించానని చెప్పగలను. నాకు జరిగిన హాని ఏమిటంటే కాస్త తక్కువ సంపన్నమైన, తక్కువ వెలుసుబాటు ఉన్న జీవితాన్ని జీవించాను. వస్తుసామగ్రి నా దగ్గర తక్కువ ఉండటం వల్ల బీదవాడిలాగ కన్పించాను. సంపద లేకపోవటం వల్ల ప్రపంచము నన్ను చిన్నవాడ్ని అనుకుంది. పట్టించుకోలేదు. ఇంతకంటే ఎక్కువ హాని ఆధ్యాత్మిక పథములో ఎవరికీ జరుగదు. దీనివల్ల నాకు ఏమిహాని జరగలేదు. నా ఏపని ఆగలేదు. ఇతరులు షడ్రసోపేతమైన వ్యంజనాలు తిన్నా నేను బార్లీ, శెనగలు మాత్రమే తిని సర్దుకున్నాను. వారు నాలిక పైన నియంత్రణ లేక రోగాల పాలైతే నేను తిన్న ఈ చౌక ఆహారము బాగా అరిగేది. శరీరము రోగరహితముగానే ఉండేది. నేను పోగొట్టుకున్న దేమిటి? నాలిక యొక్క క్షణికమైన రుచి పోగొట్టుకుని నేను తీవ్ర ఆకలి కలిగి **కివాడ్ పావడ్** (తలుపు కూడ అప్పడం అవుతుంది) యుక్తి సార్థకముగా అనుభవించాను. ఇంక రుచి గురించి అడుగుతే విలాసవంతులైన వారి ఆహారముకంటే నా యొక్క బార్లీతో తయారు చేసిన రొట్టె ఎక్కువ రుచిగలది అనిపిస్తుంది. ధనము సంపాదించి మంచిబట్టలు, మంచి ఇల్లు మొదలుగునవి చేకూర్చుకుని తమ అహంకారములను యితరులు పెంపొందించుకుంటే నేను స్వల్ప సాధన సామగ్రితో వారిలాంటి విలాసపూరిత వాతావరణాన్ని పొందలేక పోయినా సాధారణ జీవితము (ప్లెయిన్ లివింగ్) వల్ల పొందిన ఆత్మ సంతోషము, ఆనందము ముందు వారి విలాసమయ జీవితము ఎందుకు పనికిరాదు. బాల బుద్ధిగలవారు నన్ను వెక్కిరించినా అవగాహన కలవారు నా సాధారణ జీవితము యొక్క తెరవెనకాతల ఉన్న గొప్పతనాన్ని గుర్తించి దాని ముందు వారి శిరస్సులు వంచారు. మరి వారు లాభంలో ఉన్నారా? నేనా? వస్తుస్థితిని జాగ్రత్తగా గమనిస్తే తక్కువ పరిశ్రమ, తక్కువ రిస్కులు, తక్కువ బాధ్యతలు తీసుకొని నేను శారీరకంగా, మానసికంగా ఎక్కువ సుఖముగా ఉండుటే కాక సన్మానము కూడా ఎక్కువ పొందాను. పిచ్చివాళ్ళు, పిచ్చివాళ్ళను ప్రశంసిస్తే నాకేమి అభ్యంతరములేదు. వ్యక్తిగతంగా నాకే బాధ లేదు. ఆత్మ నుంచి పరమాత్మ వరకు, సజ్జనులు, దూరదృష్టి కలవారు అందరూ నా జీవనప్రక్రియా పద్ధతిని ప్రశంసించారు. కష్టాలు తక్కువ. లాభం చాలా ఎక్కువ. కోరికలతో అతి ఎక్కువ ఖర్చులతో కృత్రిమమైనటువంటి చాల బరువు అనిపించే జీవితము పాపము–పతనము అనే చక్రములు గల బండిద్వారానే మోయగలము. నాది అంతా తేలికైనదే. పక్క బట్టలు చంకలోపెట్టుకోవటం, బయలుదేరటము. ఏ అలసటా లేదు.

ఏ వ్యథాలేదు. ఆదర్శవంతమైన జీవితమే అతి సరళమైనదని నా వ్యక్తిగత అనుభవము. దానిలో ప్రకాశము,

సంతోషము, ఉల్లాసము అన్ని ఉన్నాయి. దుష్టులు ఆక్రమణ చేసి ఏదైన హాని కలగచేస్తే ఈ రిస్కులు పాప భూయిష్టమైన ఘృణిత జీవిత విధానములో కూడా ఉంటాయి కదా. సంతులు, సేవ చేసే వాళ్ళు ఎన్ని కష్టాలు సహించవలసి వస్తుందో అంతకంటే చాలా ఎక్కువ కష్టాలు ప్రతిస్పర్ధ, ఈర్ష్యా, ద్వేషము మరియు ప్రతీకారము మొదలగు కారణాల వల్ల భౌతిక జీవితములో పడవలసి వస్తుంది. హత్యలు, ఆక్రమణలు, దొంగతనాలు, దోపిడీలు, మోసములు మొదలగు వాటికి భౌతిక జీవితము మీద తీపివున్న వాళ్ళే గురికావడం చూస్తాము. ఇంత మంది వ్యక్తులు, స్వేచ్ఛగా తమ ప్రాణాలను, ధనాన్ని సమాజానికి ఇవ్వగలిగితే, వాళ్ళని దేవతలుగా కొలవటమేగాక చరిత్రలో వారి పేరు సువర్ణాక్షరాలలో లిఖించబడి వుండేది. క్రైస్ట్, సోక్రటీస్, గాంధీ లాంటి వ్యక్తులు అతి తక్కువ సంఖ్యలోనే ఈ విధంగా చనిపోయారు. వీరి కంటే వేయిరెట్లు పతనోన్ముఖ క్షేత్రంలోనే హత్యలకు గురి అవుతూ వుంటారు. తన సర్వస్వము దానమిచ్చి, బీదరికము వహించిన భామాషాలాంటి వాళ్ళను వేళ్ళమీద లెక్కపెట్టువచ్చు, కానీ మోసములు, నమ్మక ద్రోహములు, వ్యసనములు, వ్యభిచారము, ఆక్రమణలు, జ్వరములు, రోగాలు, మూర్ఖత్వము వల్ల అనేక మంది ధనవంతులు, బీదవారుగా మారడం ప్రతీ రోజు చూస్తున్నాము, వింటున్నాము. ఆధ్యాత్మిక క్షేత్రములో నష్టపోవుట, ఇతరుల ఆక్రమణ, దుఖములు తక్కువ. భౌతిక క్షేత్రములో ఇవి చాలా ఎక్కువ. ఈ సత్యమును సరిగా అర్థం చేసుకొనగలిగి వుంటే, వ్యక్తులు ఆదర్శవంతమైన జీవితం జీవించడానికి భయపడరు, మరియు భౌతిక లిప్సలో ఇరుక్కొని బోర్లా పడే మూర్ఖత్వం చేయరు. తృష్ణ-వాసన ప్రలోభముల ద్వారా, వ్యక్తి పొందేది తక్కువ, పోగొట్టుకునేది చాలా ఎక్కువ అనేది, నా వ్యక్తి గత అనుభవం. నేను పోగొట్టుకున్నది నగణ్యం, అతి స్వల్పం, కానీ ఎంత ఎక్కువ పొందానంటే, నాకు మళ్ళీ మళ్ళీ ప్రతి వ్యక్తికీ ఉత్కృష్టమైన, ఆదర్శవంతమైన పరంపరను పాటించమని చెప్పాలని అనిపిస్తుంది, కాని విషయము కొంచెం కష్టం. నేను నా అనుభవాల సాక్షిగా ఉజ్వలమైన జీవితము జీవించండి అని గోలచేస్తూ సంవత్సరాలు గడిచిపోయాయి. కానీ ఎంత మంది దానిని విన్నారు? విన్నవాళ్ళలో ఎంత మంది దాన్ని పాటించారు?

శ్రేయస్కరమైన దానిని అర్థం చేసుకొని, జీవితము యొక్క స్వరూపము, ప్రయోజనము, దాని ఉపయోగము, అర్థం చేసుకొని ఆ మార్గంలో నడిచే ధైర్య సాహసాలు చేసి ఉండకపోతే, **మాతృవత్ పరదారేషు, పరద్రవ్యేషు లోష్ఠవత్,** అనే రెండు మెట్లు ఎక్కడం నాకు కష్టమై ఉండేది. ఎవరైతే శరీరమునే అంతా అనుకొని, అదే తన నిజస్వరూపము అనుకొనేవాళ్ళు, మరియు తృష్ణ-వాసన కొరకే ఆతురత చూపించే వారు, ఆత్మిక ప్రగతి నుండి వంచితులవుతారు. పుజా-ఉపాసన లాంటి చిన్న చిన్న కర్మకాండల ఆధారముగా ఎవరి పడవ ఒడ్డుకు చేరలేదు. నేను 24 సంవత్సరాల పాటు నిరంతరము గాయత్రీ పురశ్చరణలలో నిమగ్నమై, ఉపాసన యొక్క ఒక మహత్వపూర్ణమైన ఆధ్యాయము పూర్తి చేయవలసి వచ్చింది. కానీ ఆత్మిక ప్రగతి యొక్క భావనాత్మక ప్రక్రియ, జీవన సాధనతో పాటు కలిపినప్పుడే, ఈ ఉపాసన కర్మకాండ యొక్క సాఫల్యము లభించింది. ఇతరుల వలె దేవతలను వశము చేసికొని లేక ఇతరులను మోసగిస్తూ కోరికలను పొందటానికి యంత్ర-మంత్రముల కర్మకాండ మాత్రమే చేసివుంటే, జీవన దేవతా సాధన యొక్క ప్రాముఖ్యత అర్థం చేసికొని ఉండి ఉండకపోతే, నిస్సందేహముగా, నాకు కూడా ఏమి లభించేది కాదు. నాకు లెక్కలేనంత భజనానంది మరియు తంత్ర మంత్రము గురించి పూర్తి అవగాహనతో, జీవన దేవతా సాధన చేయకుండా కర్మకాండలలోనే సంవత్సరాలు తరబడి నిమగ్నమైయున్న వాళ్ళు అనేకులు తెలుసు. వారి పూజా-ఉపాసనా విధానము నాకంటే

చాలా విస్తృతమైనది. కాని పరిశీలనగా చూస్తే వారు ఏమి పొందలేకపోయారు అనేది స్పష్టమయింది. వారిలో తమని తాము మోసము చేసుకొనే ఆత్మ ప్రవంచన చూసాను. దీని ఆధారముగా వారు ఈ జన్మలో కాకపోతే చనిపోయిన తరువాత, స్వర్గములో సుఖాలు లభిస్తాయి అనే భ్రమలో ఉన్నారు. కానీ నా ఉద్దేశ్యము, నా భవిష్య వాణి ఏమిటంటే, వీరిలో ఏ ఒక్కరికి స్వర్గము మొదలగునవి లభించవు. ఏ విధమైన సిద్ధులు చమత్కారాలు లభించవు. సాధకుడి జీవన క్రమము, ఉత్కృష్టత వైపు ఒక క్రమ బద్ధ ప్రణాళికను అనుసరిస్తూ, ముందుకు వెళుతూ ఉండాలి, అతని దృష్టి కోణములో, మంచితనం వైపు మార్పు రావాలి మరియు అతను చేసే పనులలో, క్రియా కలాపాలలో, ఒక ఆధ్యాత్మవాదికి అనుకూలమైన రీతి నీతులు కలిగి ఉన్నప్పుడే అతని కర్మకాండ కాని, పూజా పారాయణాలు కాని ఫలితాన్నిస్తాయి. ధూర్తులు, స్వార్థపరులు, పిసినారులు మరియు శరీరము, పిల్లల కొరకు మాత్రమే జీవించే వాళ్ళు తమ ఆలోచనలను కార్య పద్ధతులను పరిష్కరించుకోకపోతే వారికి తీర్థయాత్రలు, వ్రతములు, ఉపవాసములు, కథా కీర్తనలు, స్నాన ధ్యానాలు మొదలగు వాటి వల్ల ఏమి లాభము ఉండదు అని స్పష్టముగా చెప్తున్నాను. ఈ కర్మకాండలన్నీ ఉపయోగ కరమైనవే, కానీ వీటి ఉపయోగము ఒక వ్యాసము వ్రాయటానికి పెన్నువలె మాత్రమే. పెన్ను లేకుండా ఎలా వ్రాయగలము? పూజా ఉపాసన లేకుండా ఆత్మిక ప్రగతి మాత్రము ఎలా సంభవము? ఇంత తెలుసుకున్న తరువాత మనకి ఇంకొక విషయము స్పష్టముగా తెలియాలి. అధ్యయనము, స్వాధ్యాయము, చింతన, మననల, యొక్క బౌద్ధిక వికాస ప్రక్రియ సంపన్నము చేయకుండా, కేవలము కాగితము, పెన్ను ఆధారముగా, వ్యాసములు, కవితలు వ్రాయలేము. **ఆంతరిక ఉత్కృష్టత కూడా భౌద్ధిక వికాసము లాంటిదే. పూజ-ఉపాసన కర్మకాండలు మంచి పెన్ను లాంటివి.** ఈ రెండింటి సమన్వయము వల్లనే పని జరుగుతుంది. ఏది లేకపోయినా అసంపూర్ణతగానే ఉంటుంది. సాధన యొక్క బండి ఒక చక్రముతోనే నడవదు. ఉపాసన మరియు ఆంతరిక ఉత్కృష్ణత, అనే రెండు చక్రాలు, నా జీవన-సాధన అనే బండికి ఉండేటట్లు చూసుకొన్నాను. నేను ఉపాసన ఎలా చేసాను? అందులో రహస్యము ఏమి లేదు? గాయత్రీ మహా విజ్ఞానములో వివరించినట్టే నేను గాయత్రీ మంత్రము యొక్క అతి సామాన్యమైన ఉపాసన చేసుకొన్నాను.

ఒకటి మాత్రము, గుర్తుంచుకోండి. భజన చేయడానికి ఎంతసేపు కూర్చున్నా, ఆ సమయము అంతా పరబ్రహ్మము యొక్క పరమ తేజోమయి సత్తా, గాయత్రీ మాత యొక్క దివ్య ప్రకాశము, నా రోమ రోమములో ఓత ప్రోతమవుతున్నది, మరియు, ప్రచండ అగ్నిలో పడవేసిన ఇనుము ఎలా ఎర్రగా అగ్నివలె మారుతుందో నా యొక్క నగణ్యమైన అస్తిత్వము దివ్య తేజోమయముగా మారుతోంది అనే భావనచేస్తూ ఉండేవాడిని. నా ఇష్టదేవతవలే నా స్థాయి కూడా ఉత్కృష్టమవుతున్నది అనే భావన నిరంతరమూ ఉండేది. శరీరము యొక్క కణ పరమాణువులలో గాయత్రీ మాత యొక్క బ్రహ్మ వర్చస్సు ఉండడం వల్ల నా శరీరములోని ప్రతి అవయవము, జ్యోతిర్మయము అయినది. ఆ అగ్నిలో ఇంద్రియముల లిప్సన్నీ కాలిభస్మములయి పోయినవి, ఆలస్యము మొదలుగు దుర్గుణాలు నశించాయి. రోగ వికారములు ఈ అగ్నిలో కాలిపోయాయి. **శరీరము నాదే అయినా దానిలో ప్రచండ బ్రహ్మ వర్చస్సు వికసించుచున్నది.** నా వాణిలో సరస్వతి నాట్యము చేయుచున్నది. అసత్యము, మోసము మరియు రుచి అనే అసురులు నోరు అనే దివ్యమందిరము వదిలి, పలాయనము చిత్తగించారు. కళ్ళల్లో ఇతరుల సుగుణములను గ్రహించడము మరియు భగవంతుని యొక్క సౌందర్యము జడచేతనలలో అన్ని చోట్లా చూడగలిగే సామర్థ్యమే మిగిలినది. ఛిద్రాన్వేషణ, కాముకత లాంటి దోషములు నా

కళ్ళల్లో లేవు. చెవులు మంగళ కరమైనటువంటి వాటినే వింటాయి. మిగతాది అంతా కేవలము కోలాహలమే అవి శ్రవణేంద్రియములను తాకి ఏ ప్రతిస్పందన లేకుండా వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్నాయి.

గాయత్రీ మాత యొక్క వరము తేజస్వి ప్రకాశము. నా సూక్ష్మ శరీరములో, అంతఃకరణ చతుష్టయము మనస్సు, బుద్ధి, చిత్త, అహంకారములో ప్రవేశించి అవి ప్రకాశమంతమవుట దర్శించాను. ఈ బ్రహ్మ వర్చస్సు నా **మనస్సును** పాశవిక, ఇచ్ఛా ఆకాంక్షలు లేనటువంటి ఉచ్చ భూమిక వైపు, నన్ను లాక్కొని పోతున్నద అని అనుభవంలోకి తెచ్చుకొన్నాను. దివ్యత్వమును పరిప్లావితమును చేయగలిగిగే ఆకాంక్షలు మేలుకొంటున్నాయి. **బుద్ధి** క్షణిక ఆవేశానికి, తుచ్ఛ ప్రలోభము కొరకు మానవ జీవితము లాంటి అతి పెద్ద ఉపలబ్ధి నష్టము చేసుకోకూడదు అనే నిర్ణయాలు చేసుకొంటుంది. ఈ జీవితము యొక్క ప్రతి క్షణము ఆదర్శాల ప్రతిష్ఠాపనకు ఉపయోగించాలి. **చిత్తములో** ఉచ్ఛ నిష్ఠలు చోటు చేసికొని, సత్యము, శివము, సుందరము వైపు ముందుకు వెళ్ళాలనే ఉత్సాహపూరిత ఆలోచనలు, ఉత్తుంగ తరంగాలుగా ఏర్పడుతున్నాయి. సవితా దేవత యొక్క తేజస్సు, నా అంతః క్షేత్రములో ప్రవేశించి, నా **అహంను** పరిష్కృతము చేసి మరణధర్మ జీవధారుల స్థితి నుండి అనేక యోజనములు పైకి తీసుకు వెళ్ళి ఈశ్వరుని యొక్క సర్వసమర్ధ, పరమ పవిత్ర మరియు సచ్చిదానంద స్వరూపములో  స్థిర పరచుచున్నది.

గాయత్రీ పురశ్చరణ కాలములో జపము మాత్రమే నేను చేయలేదు, భావ తరంగాలు కూడా నిరంతరము మనస్సులో చేసుకొనే వాడిని, కారణ శరీరములో అనగా భావభూమి యొక్క అంతరాలలో ఆత్మబోధ, ఆత్మ దర్శనము, ఆత్మానుభూతి మరియు ఆత్మ విస్తార అనుభూతిగా అంతర్జ్యోతి రూపముగా దర్శించే వాడిని.

నా యొక్క ఆత్మ పరమ తేజస్వి సవితా దేవత యొక్క ప్రకాశములో దీపములో పురుగులు ఆత్మాహుతి చేసుకొన్నట్లు, ఆ సవితలో లీనమయి పోయినది. నా ఆస్తిత్వము సమాప్తమయినది. దాని స్థానములో పరమ తేజస్సు ప్రతిష్ఠితమయినది. నేను సమాప్తమయి పోయాను. నీ యొక్క ఆధిపత్యమే ఉన్నది. ఆత్మ మరియు పరమాత్మ యొక్క అద్వైత కలయిక యొక్క అనుభూతి క్షణక్షణము వచ్చేది. బ్రహ్మానందము యొక్క సరసత అనుభవం లోనికి వచ్చేది. ఈ అనుభూతి కొరకు ప్రపంచంలోని అన్ని విషయానందాలను వదలు కొనవచ్చును. **జపముతో పాటు స్థూల, సూక్ష్మ, కారణ శరీరములో దివ్య ప్రకాశము యొక్క ప్రతిష్టాపన, మొదట ధ్యాన ధారణ రూపములో ప్రయత్న పూర్వకముగా చేయవలసి వచ్చేది. మెల్లి మెల్లిగా అది నా సహజమయిన ప్రకృతిగా మారినది. తరువాత అది ప్రత్యక్ష అనుభూతిగా ఉండి పోయినది.** నా యొక్క ఉపాసన కాలములో నా లోపల, బయట పరమ తేజస్వి సవిత యొక్క దివ్య జ్యోతి సాగరము అనుభూతిలోకి వస్తూ, నా యొక్క అస్తిత్వము, ఈ దివ్య జ్యోతితో ఓతప్రోతమవుతోంది అని నిరంతరము అనుభూతి చెందేవాడ్ని. ఈ ప్రకాశము తప్ప, నా అంతరంగ బహిరంగములో ఇంక ఏమి లేదు. నా ప్రాణము యొక్క ప్రతి స్పురణలో జ్యోతి స్ఫుల్లింగముల కంటే నాకు ఏమి మిగలలేదు. ఈ దివ్య అనుభూతులతో, కనీసము పూజ సమయములో ఖచ్చితంగా నన్ను నేను ఓతప్రోతము చేసుకుంటూ వుండే వాడ్ని. ఉపాసన, సాధన యొక్క పూర్తి సమయము ఈ అనుభూతితోనే ఉండేవాడ్ని.

పూజ యొక్క ఆరుగంటలు, మిగిలిన 18 గంటలకు ప్రేరణని ఇచ్చేది. ఏ పని చేస్తున్నా, ఇష్టదేవత యొక్క ఈ తేజస్సే నాకు మార్గదర్శకము. ఆయన సంకేతనుసారమే నా యొక్క ప్రతి పనీ, క్రియ జరుగుతున్నది. నేను లాలస, లిప్స, తృష్ణ లేక వాసనలతో ప్రేరితమై ఏ పని చేయుట లేదు. తల్లి ఏ విధముగా చిన్న పిల్ల వాడి

వేలు పట్టుకొని నడిపిస్తుందో, అదే విధముగా **ఆ దివ్యసత్తా, నా మస్తిష్కమును పట్టుకొని, ఉచ్ఛ ఆలోచనలను ఆలోచించు కోవడానికి, మరియు శరీరాన్ని పట్టుకొని ఉచ్ఛ ఆదర్శాల వైపు నడవటానికి వివశుడుని చేసింది.** ఉపాసన తరువాత మెలుకువగా ఉన్న ప్రతిక్షణం శారీరక నిత్య కర్మల నుండి, ఉపాసన, స్వాధ్యాయ, చింతన, శరీర పోషణ నిమిత్తము, చేసే పనులు కుటుంబ వ్యవస్థ మొదలగు అన్ని క్రియలు, ఆ పరమేశ్వరుడే నియోజన చాలన, చేస్తున్నాడనే అనుభూతి నిరంతరము ఉండేది. రాత్రి పడుకొనే ఆరు గంటలు ఎంత గాఢంగా నిద్రపోయే వాడినంటే, సమాధి స్థితిలో ఉన్నానా అని అనిపించేది. తల్లి ఒడిలో నన్ను నేను సమర్పించుకొని, పరమ శాంత సంతుష్ట భూమికలో ఆత్మ సత్తాతో తాదాత్మ్యత చెందే వాడ్ని. లేచిన తరువాత కొత్త జీవితము, కొత్త ఉల్లాసము, కొత్త ప్రకాశము, మార్గ దర్శనము నా ముందు నడుస్తూ పథ ప్రదర్శనకు తయ్యారుగా ఉండేవి.

24 సంవత్సరాల, 24 మహా పురశ్చరణ కాలములో సామాజిక పారివారిక బాధ్యతలు ఏమి నాకు లేవు. అందువల్ల పూర్తి తత్పరతతో తన్మయత్వముతో ఈ జప-ధ్యానముల సాధనా క్రమము సక్రమముగా నడచినది. **మాతృవత్ పరదారేషు,** మరియు **పరద్యవ్యేషు లోష్టవత్,** అనే నిరంతర నిష్ఠ శరీరమును, పాప కర్మముల నుండి రక్షించింది. అన్నము యొక్క సాత్వికత, మనస్సును మానసిక అధఃపతనములో పడకుండా కాపాడినది. బార్లీ రొట్టె, ఆవు యొక్క మజ్జిగ, ఈ ఆహారము, రుచించినది, అరిగినది. **ఆహారము బట్టి మనస్సు అనే సత్యము నా జీవిత కాలములో అడుగడునా, అనుభములోకి వచ్చినది - అతి తీవ్ర సంయనములతో శరీరము, మనస్సును విగ్రహించకుండా ఉండక పోతే ఏ ప్రగతిని సాధించ లేక పోయేవాడ్ని.**

# నా దృశ్య జీవితము యొక్క అదృశ్య అనుభూతులు

## ఫిబ్రవరి 1971 – అఖండజ్యోతి

నా ఆధ్యాత్మిక సాధనలోని రెండు మజిలీలు, 24 సంవత్సరాల కాలములో పూర్తి అయినది. సాధారణముగా యువావస్థలోనే **మాతృవత్ పరాదారేషు, పరద్రవ్యేషు లోష్టవత్** అనే ఆదర్శము నుండి అతిక్రమణము జరుగుతుంది. కామ లోభముల ప్రబలత కూడా ఈ రోజుల్లోనే ఉంటుంది. 15 సంవత్సరముల వయస్సు నుండి 24 సంవత్సరములలో నాకు 40 ఏళ్ళు వచ్చే లోపల వాటి తీవ్రత తగ్గింది. సాధారాణంగా ఈ వయస్సులోనే కోరికలు, వాసనలు, తృష్ణలు, మహత్వాకాంక్షలు, ఆకాశ పాతాళములను కలపటానికి ప్రణాళికలు వేస్తూ వుంటాయి. ఈ అవధి స్వాధ్యాయ, మనన, చింతనలకు, ఆత్మ సంయమనము, జప, ధ్యాన సాధనకు ఉపయోగించబడినది. ఈ వయస్సులో అనేక వికారములు ప్రబలముగా ఉంటాయి. అందువల్ల సాధారణముగా పరమాత్మ ప్రయోజనములకు 40 ఏళ్ళు వయస్సు దాటిన వ్యక్తులనే ఉపయోగిస్తారు.

పెరుగుతోన్న వయస్సులో అర్థవ్యవస్థ నుంచి, సైన్య సుంచాలన లాంటి అనేక మహత్వ పూర్ణ కార్యాల బాధ్యత తీసుకోవలసి ఉంటుంది. సేవా కార్యాలలో కూడా యువకులు చాలా సహాయము చేయగలరు. కానీ లోక మంగళ కార్యముల నేతృత్వము చేయడానికి, ఈ వయస్సు సరి అయినది కాదు. శంకరాచార్య, దయానంద, వివేకానంద, రామదాసు, మీరా, నివేదితా లాంటి కొంతమంది తక్కువ వయస్సులోనే మంగళ కార్యనేతృత్వ భారము వహించి దానిని నెరవేర్చగలిగారు. సాధారణంగా తక్కువ వయస్సు గందరగోళాలని సృష్టిస్తుంది. పేరు, పదవులమీద ఆకాంక్ష, ధనప్రలోభనము, వాసనాత్మక ఆకర్షణ వున్నవాళ్ళు సామాజిక క్షేత్రములో నేతృత్వము వహించుటకు ప్రవేశిస్తే అనేక వికృతులు సంభవిస్తాయి. అనేక అభివృద్ధి చెందుతున్న సంస్థల సర్వనాశనము ఇలాంటి వారివల్లే జరుగుతుంది. మంచి చెడు అన్ని వయస్సుల వారిలో ఉన్నా సాధారణంగా యవ్వనములోనే మహాత్వాకాంక్షలు ఉంటాయి. పెరుగుతున్న వయస్సుతో పాటు స్వాభావికముగ వ్యక్తిలో ఈ కోర్కెల వేడి తగ్గుతుంది. అప్పుడు అతని భౌతిక లాలసలు కూడా తగ్గుతాయి. మరణకాలము సమీపిస్తున్నది అని గుర్తువచ్చి పరలోకము సవరించుకోవటానికి ధర్మకార్యముల మీద రుచి పెరుగుతుంది. ఇందువల్ల తత్వవేత్తలు వానప్రస్థ–సన్యాసముల కొరకు ఆయువు యొక్క ఉత్తరార్థమునే ఉపయుక్తము అని నిర్దేశించారు.

అది ఏమి రహస్యమో కాని నా మార్గదర్శకుడు నా యవ్వనము అంతా కఠోర తపశ్చర్యకు వినియోగించాడు. తపస్సు సాధనలోనే 40 యేళ్ళ వయస్సు వచ్చినది. వర్చస్వ, నేతృత్వ, అహంకార, మహాత్వకాంక్షల ప్రలోభనాలలో కొట్టుకుని పోయే ప్రమాదముందని అనుకున్నారెమో అతి పెద్ద పనులు చేయుటకు కావలసిన ఆంతరిక పరిపక్వము మరియు ఆత్మబలము లేదు అనుకున్నారెమో, లేక గొప్ప పనులు చేయుటకు అవసరమైన సంకల్పబల, ధైర్య, సాహస,

సంతులనములను పరీక్షించారెమో, ఏది ఏమైన నా మొదటి 40 సం॥లు నేను మీతో అనేకసార్లు చర్చించిన సాధనాక్రమములోనే గడిచి పోయినాయి.

ఈ అవధిలో అంతా సామాన్యముగానే ఉంది. అసామాన్యమైనదొకటే. అది ఆవునేతితో నిరంతరము వెలిగే అఖండ దీపము. నా పూజాగృహములో నిరంతరము అది వెలుగుతునే వుండేది. దీని యొక్క వైజ్ఞానిక లేక ఆధ్యాత్మిక రహస్య మేమిటి? నేను సరిగ్గా చెప్పలేన.ు గురువు గురువే కదా. ఆదేశము ఆదేశమే. అనుశాసనము అనుశాసనమే. సమర్పణంటే సమర్పణే, ఒకసారి బాగా పరిక్షించి ఈ పడవలో ప్రయాణిస్తే ప్రమాదము లేదు అని నిర్ణయించుకున్నాక కళ్ళుమూసుకుని కూర్చుండి పోయాను. మిలిటరీలో సైనికుడికి అనుశాసనము ప్రాణమునకంటే ఎక్కువ ప్రీతికరమైనది. నాది అంధశ్రద్ధ అనుకోండి లేక అనుశాసన ప్రియత అనుకోండి, నాజీవితానికి ఏదిశను నిర్ధారించారో, ఏకార్య పద్ధతిని ఆచరించమన్నారో, దానినే సర్వస్వమనుకొని పూర్తి నిష్ఠతో పూర్తి తత్పరతతో చేసుకుంటూ వెళ్ళాను. నా సాధనా గదిలో అఖండ దీప స్థాపన ఈ ప్రక్రియలోని భాగమే. మార్గదర్శకుడిని విశ్వసించాను. పూర్తిగా ఆయనకు సమర్పణ చేసుకున్నాను. **ఇంక ప్రశ్నలెందుకు? తర్కములెందుకు? సందేహములెందుకు? ఇవి ఎప్పుడు నాలో ఉదయించలేదు.** నా సాధనలో అఖండ దీపము అత్యంత అవసరము అని చెప్పారు. అంతే పురశ్చరణలు పూర్తి అయ్యేవరకు అలాగే వెలుగుతూ వుండేటట్లు చూశాను. ఆ తరువాత అది ప్రాణప్రియముగా మారినది. 24 సం॥ల తర్వాత దానిని ఆర్పి వేయవచ్చు, కాని ఆ ఊహే నాకు ప్రాణాంతకముగా అన్పించినది. అందువల్ల ఇంక అది నా జీవితాంతము వెలుగుతూ ఉంటుంది. నేను అజ్ఞాతవాసానికి వెళ్ళాను. ఇప్పుడు మళ్ళీ వెళ్ళబోతున్నాను. అప్పుడు నా ధర్మపత్ని దీని భాధ్యత వహిస్తుంది. నేను ఏకాకినై వుంటే, భార్యలేక పోతే ఇంకొక విధానము ఏర్పరచేవాడిని, అఖండదీప బాధ్యత చాలా క్లిష్టమైనది. వేతనము కోసము, శ్రద్ధలేని వాళ్ళు, ఆంతరిక దృష్టితో దుర్బలులు ఈ దివ్య అగ్నిని కాపాడలేరు. అనేక మంది అఖండ దీపస్థాపన చేస్తారు. అవి పేరుకు మాత్రమే అఖండ దీపములు, అనేకసార్లు ఆరిపోతూ వుంటాయి . మళ్ళీ వెలిగిస్తూ వుంటారు. నా జ్యోతి అఖండముగా వుండుటకు కారణం బాహ్య సతర్కతకాదు. అంతర్నిష్ఠ కారణమని తెలుసుకోవాలి. దీన్ని అక్షుంణముగా వుంచుటకు నా ధర్మపత్ని అసాధారణ సహాయ సహకారములందించినది.

అఖండ దీపము, అఖండయజ్ఞ స్వరూపమేమో. అగరుబత్తులను వెలిగించుట **హవన-సామాగ్రి** యొక్క, జపము **మంత్రోచ్చారణ** యొక్క, జ్యోతి, నేతితో **ఆహుతి** వేసే క్రియా కలాపాలకు సంకేతమేమో. ఈ విధంగా ఒక అఖండ హవనము యొక్క స్వసంచాలిత ప్రక్రియ జరుగుతున్నదేమో. నీటితో నిండిన కలశము, వెలుగుతున్న దీపస్థాపన, **అగ్ని-జల సంయోగముతో స్టీమింజన్ లాంటి సూక్ష్మ ప్రయోజనము** జరుగుతున్నదేమో. అంతర్జ్యోతి వెల్గించికొనుటకు ఈ బాహ్య జ్యోతి నుండి సహాయము లభిస్తున్నదేమో. ఏది ఏమైన ఈ అఖండజ్యోతి నుంచి నాకు భావనాత్మక ప్రకాశము అనుపమానందము, ఉల్లాసము నిరంతరము

లభిస్తున్నది. బయట పూజా వేదిక మీద పెట్టిన ఈ దీపము కొన్ని రోజులు బయటనే వెలుగుతున్నట్టు కన్పించినా మెల్లి మెల్లిగా నాలోపల కూడ ఈ అఖండజ్యోతి నా అంతఃకరణలో అలాగే నిరంతరము వెలుగుతున్నదన్న అనుభూతి స్పష్టముగా తెలియుట మొదలెట్టినది. ఏవిధంగా పూజా గృహములో ఈ అఖండ జ్యోతి తన ప్రకాశమునందజేస్తున్నదో అదే విధముగా నా సమస్త అంతరంగము నాలో వెలుగుతున్న అఖండజ్యోతి ద్వారా జ్యోతిర్మయముగా మారుతున్నదని నిరంతరము తెలిసినది. నేను శరీరము, మనస్సు, ఆత్మలో, స్థూల-సూక్ష్మ -కారణ-శరీరాలలో ఏ జ్యోతి అవతరణ సాధన-ధ్యానము చేయుచున్నానో సంభవత అది ఈ అఖండ దీపము యొక్క ప్రతిక్రియయేమో, నా ఉపాసన యొక్క సంపూర్ణ అవధిలో ఏ విధముగా ఉపాసనా గృహములో అఖండ దీపము తన వెలుతురును విస్తరింపచేసిందో అదే విధముగా భావనాక్షేత్రములో కూడ అటువంటి ప్రకాశమే అన్ని వైపుల విస్తరించేది. నేను, నాది అంతా ప్రకాశమయమే. చీకటి పొరలు తొలగిపోయాయి . మోహాంధకారము భస్మమైనది. ప్రకాశమయమైన భావనలు, ఆలోచనలు, గతి విధులు నాశరీరమును మనస్సును ఆవరించుకున్నాయి. సర్వత్రా అన్ని వైపులా ప్రకాశము సముద్రములవలె విస్తరించి యున్నది. నేను చేపవలె ఈ విశాల ప్రకాశ సముద్రములో ఈదులాడుతున్నాను. ఈ అనుభూతులు, ఆత్మబలము, దివ్య దర్శనము మరియు అంతఃఉల్లాసము, వికసించడానికి అఖండ దీపము ఎంత సహాయపడినదో నేను చెప్పలేను. ఇది నాయొక్క కల్పనయే కావచ్చు, ఊహయే కావచ్చు, కాని నేనెప్పుడు అనుకుంటాను పూజా గృహములో అఖండ దీప స్థాపనే చేసియుండకపోతే పూజాగృహములో ఆవరించి వుండే మసక వెలుతురువలె నా అంతరంగము కూడ మసక-మసకగానే ఉండేదేమో. ఇప్పుడైతే నాకు ఈ అఖండ దీపము దీపావళి దీప పర్వమువలె నా నరనరాలలో మెరుపుమెట్లు గొలుపుతూ కన్పిస్తున్నది. నా భావభరిత అనుభూతుల ప్రవాహములో 32 సం॥ల పూర్వము మాసపత్రిక ఆరంభించినపుడు ప్రపంచములోకెల్ల నాకు ప్రియమైన నేనిష్టపడే సర్వోత్తమమైన పేరు **'అఖండజ్యోతి'** అని పెట్టాను. ఆ భావావేశములో ప్రతిష్టించబడిన మాసపత్రిక ఈ అఖండ దీపము యొక్క చిన్న విగ్రహముగా, మూర్తిగా, ప్రపంచములో మంగళమయ ప్రగతి ప్రకాశ కిరణాలు విస్తరింప చేయుటలో సమర్థవంతముగా ఉపయోగపడింది. **నా అఖండ దీపములోని కొన్ని ప్రకాశ కుంజములే ప్రతినెల అఖండజ్యోతి మాసపత్రికగా వస్తున్నవి.**

సాధన యొక్క మూడవ చరణములో ప్రవేశించగానే **'ఆత్మవత్ సర్వభూతేషు'** కిరణాలు వెదజల్లబడ్డాయి. **'మాతృవత్ పరదారేషు'** మరియు **'పరద్రవ్యేషులోష్టవత్'** సాధన నా శరీరము వరకే సీమితము. కళ్ళల్లో పాప దృష్టి వస్తే వివేకము అనే మూడవ నేత్రము తెరచి దానిని భయపెట్టి పారద్రోలాను. శరీరము మీద అత్యంత కఠోర నియమాలతో సంకెళ్ళు వేశాను. దానివల్ల దారితప్పే పరిస్థితిలేర్పడే సంభావనను తీసివేశాను. ఇంక దుష్ట వ్యవహారము చేయలేను కదా! **మాతృవత్ పరదారేషు** సాధన ఎటువంటి అవరోధాలు లేకుండా నిభాయించుకున్నాను. ప్రారంభములో మనస్సు కొంచెము ఎదురు తిరిగినది. బాధపెట్టినది, కాని

శరీరము నాకు ఎప్పుడు సహకరించినది మనస్సు నిరాశచెంది తన ఓటమిని ఒప్పుకుంది. ఆ తరువాత అది నాకు పూర్తిగా మిత్రుడై సహకరించింది. స్వేచ్ఛగా బీదరికాన్ని వరించటం వల్ల, అవసరాలను సాధ్యమైనంతగా తగ్గించుకొనుటవల్ల, సేకరణ అనే భావనను పూర్తిగా వదలి వేయటం వల్ల పరద్రవ్యము మీద ఆకర్షణ తొలగి పోయినది. పొట్ట నింపుకోవటానికి, శరీరము కప్పుకొనుటకు, నా స్వఉపార్జనే సరిపోతే పరద్రవ్యము అపహరించుకొనుటకు అవసరమేముంది? మిగిలినది, దొరికినది ఇతరులకు పంచుతూ వచ్చాను. పంచటము , ఇవ్వటము అను రుచి మరిగి ఆ అనుభూతిలో ఆనందం పొందగల్గినపుడు ఇక సేకరించి సంగ్రహించటమెందుకు? ఏ ప్రయోజనం కొరకు పరద్రవ్యమును ఆశించే పాపం చెయ్యాలి. సాధారణ బీద అపరిగ్రహి బ్రాహ్మణ జీవితం నాలో ఒక అసాధారణ ఆనందము, సంతోషము, ఉల్లాసము నింపినది. ఈ అనుభూతి ఇతరులకు కూడ లభిస్తే ఎవ్వరి మనస్సుకి పరద్రవ్యమును ఆశించి పాప భారమును శిరస్సుమీద మోపే కోరికే కలుగదు. అపరిగ్రహమువల్ల లభించే అనుదానాల ప్రక్రియ అంతఃకరణములలో ఎంత అద్భుతమైన ప్రభావము చూపిస్తుందో యెవరికెరుక? నాకు మాత్రము ఈ దివ్య విభూతుల భాండాగారము అప్రయత్నముగానే దొరికినది.

ఆ తరువాత అడుగులో ఆధ్యాత్మికత యొక్క మూడవ మజిలీవస్తుంది. అది **'ఆత్మవత్ సర్వభూతేషు'** . అందరిని తనలాగే భావించుకొనుట వినుటకు, చెప్పుటకు ఈ శబ్దావళి అతిసాధారణము అన్పిస్తుంది. దీని అవధి నాగరిక కర్తవ్యముల పాలన, శిష్టాచారము, సద్వ్యవహారము వరకు వెళ్ళి ఆగిపోతుంది. కాని దీని తత్వజ్ఞానము అతి విస్తృతము. పరమాత్మసత్తాతో పూర్తిగా కలిసిమెలసి ఏకీకరణ చెందే స్థితి దీని పరిధి. ఈ సాధన కొరకు ఇతరుల అంతరంగముతో తన అంతరంగమును మేళవించి వారి సంవేదనలను తన సంవేదనగా అనుభూతి చెందాలి. వసుధైక కుటుంబకము యొక్క మాన్యత దీని మూర్తీభవించిన రూపమే. అందరూ నా కుటుంబీకులే, నాతోపాటు ఇతరులు మరియు ఇతరులతోపాటు నేను ఒకే సూత్రములో గ్రుచ్చబడి ఒకరిలో ఒకరు పూర్తిగా కలిసిపోయిన భావన, ఈ అనుభూతి యొక్క ప్రతిక్రియ. ఇతరుల సుఖము తన సుఖముగానూ ఇతరుల దుఃఖము తన దుఃఖముగా అనుభవములోకి వస్తుంది. ఇటువంటి వ్యక్తి తన వరకే సీమితము కాలేదు . స్వార్థ పరిధిలో కట్టబడివుండలేదు. ఇతరుల దుఃఖమును నివారించటానికి, వారికి సుఖములు చేకూర్చుటకు చేసే ప్రయత్నాలు తన వ్యక్తిగత ఆకాంక్షగా, ప్రయోజనముగా అన్పిస్తాయి.

సంసారములో అనేకమంది వ్యక్తులు సుఖముగా వున్నారు. సన్మార్గముమీద నడుస్తున్నారు. మరియు మానవజీవితానికి ధన్యత ఆపాదించుకుంటూ తమకి ఇతరులకు మంగళమయ వాతావరణం నిర్మించుకుంటున్నారు. ఈ ఆలోచనే చాలా ఓదార్పునిస్తుంది. ప్రపంచాన్ని ఈశ్వరుడు నిజంగా పవిత్ర ఉద్దేశ్యముల పూర్తికొరకు నిర్మించాడనే నమ్మకం కల్గుతుంది. ఇక్కడ పుణ్య, జ్ఞానములున్నవి. వీటిని ఆధారముగా చేసుకొని ఎవరైన ఆనందము ఉల్లాసము పొందగలరు. శాంతి సంతోషముల దివ్య ఉపలబ్ధులు కావలసిన పరిమాణంలో

పొందగలరు. పుణ్యాత్మ, పరోపకారి, ఆత్మావలంబి వ్యక్తుల యొక్క అభావము ఇక్కడలేదు. సంఖ్యలో వీరు తక్కువ మందే కావచ్చు, కాని వారి ప్రకాశం అన్ని వైపులా విస్తరిస్తుంది కదా! వారి ఉనికి మనిషిలో దేవత్వమున్నది అని నిరూపిస్తున్నది. ఎవరైన అతిస్వల్ప ప్రయత్నములతో దీనిని సజీవము చేసుకొని సక్రియము చేయగల్గుతారు. పృథ్వి మీద వీరుల కొరత లేదు. ఇక్కడ నరనారాయణులున్నారు. పరమాత్మ ఎంతగొప్పవాడో ఉదారుడో దివ్యమైనవాడో దాని పరిచయము ఆయన ప్రతికృతులైన ఆత్మలలో చూడవచ్చును. వీరు శ్రేయోమార్గాన్ని అవలంబించి, దారిలో ముళ్లను తమకాలితో నలిపివేస్తూ లక్ష్యమువైపు  శాంతి, శ్రద్ధ మరియు ధైర్యముతో ముందుకు వెళ్తుంటారు. **మానవత్వాన్ని గౌరవాన్వితము చేసే ఈ మహామానవుల ఉనికి భగవంతుడు మళ్ళీ మళ్ళీ మానవ శరీర ధారణ చేసి ఈ పృథ్వి మీద అవతరించుటకు కోరుకునేటట్లు చేస్తున్నది.** ఆదర్శముల ప్రపంచములో విచరణ చేసేటటువంటి, ఉత్కృష్ఠమైన గతి విధులను అవలంబన చేసుకునే మహామానవులు బహిరంగములో లేమిలో వున్నట్టు కన్పించినా అంతరంగములో ఎంత సమృద్ధితో మరియు సుఖసంతోషాలతో ఉన్నారో చూసి నా హృదయము కూడ పులకించింది. వారి శాంతి నా అంతఃకరణాన్ని స్పృశించింది. పుణ్యాత్మ యుధిష్ఠిరుడు కొంతకాలం నరకములో ఆగినపుడు అక్కడున్న ప్రాణులు ఎంత ఆనందంలో మునిగి పోయారో తెలిపే మహాభారతములోని సంఘటన నాకు నిరంతరము గుర్తుకు వస్తుంది. **పుణ్యాత్మల స్మృతి మాత్రముతోనే నాకు** ఇంత సంతోషము ప్రకాశము లభిస్తే వారు స్వయముగా ఎన్ని దివ్య అనుభూతులు అనుభవించే వారో అని అనుకుంటూ వుంటాను. **ఈ అసహ్యకరమైన ప్రపంచంలో ఏమాత్రము సౌందర్యము ఉన్నా అది ఈ పుణ్యాత్మల, అనుదానమే,** అసీమ అస్థిరతతో నిరంతరము ప్రేత పిశాచములవలె హాహాకారి నృత్యము చేసే అణువు పరమాణువులతో నిండిన ఈ ప్రపంచంలో వున్న స్థిరత్వము, శక్తి ఈ పుణ్యాత్మల ద్వారానే ఉత్పన్నమైనది. అన్నిచోట్ల వెదజల్లబడియున్న జడ పంచతత్వములలో కన్పించే సరసత, శోభ ఈ సత్పథగాముల ప్రయత్న పురుషార్థమే. ప్రలోభనాలు ఆకర్షణల  బంధనాలు ఛేదించుకుని ఎవరైతే ఈ సృష్టిని సుగంధమయం చేసి శోభాయమానముగా చేయాలని సంకల్పించారో వారి శ్రద్ధయే పృథ్విని ధన్యము చేస్తున్నది. ఎవరి పుణ్య ప్రయత్నాలు లోక మంగళము కొరకు నిరంతరము గతిశీలముగా యున్నాయో అటువంటి నర-నారాయణుల దర్శనము స్మరణము చేసుకొని పుణ్యము పొందాలనే కోరిక నిరంతర ముండేది. వారి చరణ ధూళి శిరస్సున వేసుకొని నన్ను నేను ధన్యం చేసుకోవాలి అనే కోరిక నిరంతరముండేది. ఎవరు తన ఆత్మను పరమాత్మగా మార్చుకున్నారో ఆ పురుషోత్తములలో ప్రత్యక్షముగా పరమేశ్వరున్ని చూసి ఈనాడు కూడ ఈశ్వరుడు సశరీరముగ ఈ పృథ్వి మీద నివసిస్తూ తిరుగుతున్నాడని స్పష్టముగా కన్పించేది. నా నలువైపులా ఇంత పుణ్య పరమార్థములు కన్పిస్తుంటే సంతోషము పొందుటయేగాక ఇక్కడే అనంత కాలము ఉండుటకు మనస్సులో కోరిక ఉదయించేది. ఈ పుణ్య ఆత్మల సాన్నిధ్యంలో స్వర్గము, ముక్తి, సిద్ధి మొదలగు వాటికంటె చాలా ఎక్కువ ఆనందం పొందగలము. ఈ అనుభూతిని నేను ఎప్పుడైతే  స్వయముగా నిరూపించుకున్నానో

కష్టములతో కూడిన జీవిత విధానము మధ్య ఈ విశ్వసౌందర్య స్మరణ నాకు నిరంతరం ఉల్లాసము యిచ్చేది.

**ఆత్మవత్ సర్వభూతేషు** యొక్క ఈ సుఖోపలబ్ధితో పాటు దాని రెండవ పక్షము కూడ నాకు స్పష్టముగా కన్పించింది. ప్రపంచంలో దుఃఖమునకు కొదువలేదు. కష్టము, క్లేశము, శోకసంతాపములు, అభావము, దారిద్ర్యముతో అనేక మంది వ్యక్తులు నరకయాతనలు అనుభవిస్తున్నారు. సమస్యలు, బాధలు, అనేక రకమైన ఉద్వేగములు, మనష్యులను తినివేస్తున్నాయి. అన్యాయము, శోషణ యొక్క కుచక్రములో అనేకులు ఇరుక్కుని బాధపడుతున్నారు. దుర్బుద్ధి సర్వత్ర నారకీయ వాతావరణాన్ని నిర్మిస్తోంది. అపరాధములు, పాపముల దావానలములలో  కాలిపోయి ఛీత్కారములతో, వేదనలతో బాధపడువారి గురించి చూస్తు వింటూ వుంటూనే ఇంత వ్యధ కల్గుతుంటే ఇవన్ని భరిస్తున్న వాళ్ళ పరిస్థితి యేమిటి? సుఖసాధనాల సామాగ్రి ఈ ప్రపంచంలో తక్కువలేదు. అయినా దుఃఖదైన్యముల కంటే ఎక్కడా ఏమి కన్పించుట లేదు. ఒకరికొకరు స్నేహసద్భావనలతో సహకరించుకోగల్గితే ఈ కష్టవేదనల నుండి తప్పించుకోగలరు. ప్రగతి, సమృద్ధి యొక్క సద్భావనలు తెచ్చుకోగలరు. కాని యేమి చేయగలము, మనోభూమియే వికృతమైతే, ఆలోచనా విధానమే తల్లక్రిందులైతే అనుచిత క్రియా కలాపాలే చేస్తూ వుంటే, **విషవృక్షాన్ని నాటుకుని, అమృత ఫలమును ఎలా ఆశించగలము?**

సర్వత్రా వ్యాపించిన దుఃఖదారిద్ర్యము, శోకసంతాపాలతో సమస్త మానవజాతికి ఎన్ని కష్టాలువస్తున్నాయో, పతన పాపముల గర్తములలో మనుష్యులు ఎంత గొప్పగా, వేగముగా పడిపోతున్నారో చూస్తూవుంటే వింటూంటే నా అంతరాత్మ కన్నీరు కార్చింది. వ్యక్తి తన ఈశ్వరీయ అంశను, ఆస్తిత్వమును ఎందుకు మరచిపోయాడు? తన స్థాయిని, స్వరూపాన్ని ఇంత క్రిందకు ఎందుకు దిగజార్చాడు? ఈ ప్రశ్నలు నిరంతరం నా మనసుని తొలచేవి. తెలివితేటలు, చతురత, అవగాహన సామర్థ్యము అన్ని వున్నవి. ఒక దానికంటే ఒకటి మించిన కళాకౌశలమును వ్యక్తులు అందజేస్తునే వున్నారు. ఒకరిని మించి ఒకరు చాతుర్యము చమత్కారమును పరిచయము చేస్తూనే వున్నారు. వీరికి దుష్టత, నికృష్టతల సహాయముతో ఏమి పొందాలనుకుంటున్నారో అది మృగతృష్ణయే అని, దాని వల్ల పతనము సంతాపము మాత్రమే దొరుకుతున్నదని ఎందుకు అర్థంకాదు. మానవులు తమ తెలివితేటలతో ఇంగితజ్ఞానము స్నేహ సౌజన్యములు వికసితము చేయుట వల్లనే మానవీయ గౌరవానికి అనురూపమైన పరిస్థితులు ఏర్పడతాయని మరియు ప్రగతికి ఇవి చాలా అవసరము అన్నది అర్థం చేసుకొనగల్గితే ప్రపంచ పరిస్థితి వేరే విధంగా వుండేది. అందరూ సుఖముగా శాంతి సౌఖ్యాలతో జీవిస్తూండేవారు. ఎవరు ఎవరిని అవిశ్వాసము సందేహముతో చూడవలసిన పరిస్థితి వుండేది కాదు. ఎవరు ఇతరులవల్ల మోసపోరు. బాధపెట్టబడరు. అప్పుడు ప్రపంచములో దుఃఖదారిద్ర్యముండేది కాదు. సర్వత్రా సుఖశాంతి యొక్క సుగంధము వ్యాపించి వుండేది.

తెలివైన మానవుడు పాపము యొక్క ఫలము దుఃఖము, పుణ్యము యొక్క ఫలము సుఖము అనే అతిస్పష్టమైన  కార్యాచరణ పద్ధతి ఎందుకు అర్థం చేసుకోడో తెలియదు. ఆచరించుటకు అసలు ప్రయత్నించడు.

ప్రపంచ చరిత్రలో అనేక మంది అనుభవాల సాక్ష్యము అనీతిని ఆచరించి స్వార్థ సంకీర్ణతతో లిప్తమైవున్న ప్రతి ఒక్కరికి పతన సంతాపాలే లభించాయని స్పష్టముగా తెలుపుతుంది. ఉదాత్తత చెంది, నిర్మలత్వము చెందకుండా ఎవరు శాంతి పొందలేరు. సన్మానము, ఉత్కర్షసిద్ధి ఎవరికీ ఆదర్శవంతమైన విధానమును అవలంభించకుండా లభించదు. కుటిలత ఏడు పరదాలు దాటుకొని తనను తానే తెలుపుకుంటుందని అడుగడుగునా చూస్తున్నా . మనము ప్రపంచం యొక్క కళ్ళల్లో మట్టిగొట్టి మన ధూర్తతను దాచుకొనగలమని ఎలా అనుకుంటామో తెలియదు. ఎవరూ మన దుర్భావనలను తెలుసుకొన లేరు ఈ దాగుడు మూతల ఆట నిరంతరం ఆడగలమని ఎలా అనుకుంటున్నాము? ఇలా ఆలోచించే వాళ్ళు, వేయి కళ్ళతో చూడగల్గే, వేయి చేతులతో పట్టకొనగల్గే విశ్వాత్మ ఎవరు ఎన్ని పరదాల వెనకాతల దాగివున్నా వారిని బయటకు తోస్తుందని ఎందుకు మరచిపోతారు. వాస్తవికత ఖచ్చితంగా ప్రకటీకరింపబడుతుంది. మోసము పైకప్పుకెక్కి తనను తానే ప్రకటీకరించుకుంటుంది. ఈ సనాతన సత్యము, పురాతన తథ్యము ప్రజలు తెలుసుకొనగల్గితే అశుభమును ఆధారముగా చేసుకుంటె పొందే దుర్గతి అనుభవములోకి తెచ్చుకోగల్గితె రాజమార్గమైన సన్మార్గమును వదలి కంటకాకీర్ణమైన కుమార్గముమీద ఎందుకు నడుస్తారు. దారి తప్పుతారు. ఎందుకు ఏడుస్తూ, బాధపడ్తూ, సురధుర్లభమైన మానవ జీవితాన్ని కుళ్ళిపోయిన శవమువలె మోస్తూ ఈడ్చుకుంటూ జీవిస్తారు?

దుర్బిద్ధియొక్క ఈ విస్తారము, దాని వలలో అనేక మంది నిస్సహాయులైన ప్రాణులు ఛీత్కరిస్తూ యిరుక్కుని బాధపడ్తున్న ఈ దయనీయ దుర్దశ, నాకు మర్మాంతకమైన పీడగా మారింది. **ఆత్మవత్ సర్వభూతేషు** సాధన, విశ్వమానవుని ఈ వ్యధ, నా వ్యధగా మార్చింది. నాకాళ్ళు చేతులే యెవరో రకరకాలుగా మడచి మండిస్తున్నారు అన్పించింది. అందరిలోనూ నా ఆత్మ గ్రుచ్చబడి వున్నది. అందరూ నా ఆత్మలోనే గ్రుచ్చబడి వున్నారు అను గీతా వాక్యము చదువుటకు వినుటకు పర్వాలేదు కాని ఇది అనుభూతి యొక్క స్థాయిలో దిగి అంతఃకరణములో ప్రవేశించినపుడు పరిస్థితులు వేరే రకంగా వుంటాయి. వ్యక్తి యొక్క అంగ అవయవముల యొక్క కష్టము అతనిని ఎంత బాధ పెడ్తుందో, తన స్త్రీ పుత్రాదుల పీడ అతని చిత్తమును ఎంత విచలితము చేస్తుందో, సరిగ్గా అటువంటి బాధ ఆత్మవిస్తారదిశలో ముందుకు వెళ్ళినపుడు విశ్వవ్యాపక దుఃఖము నా దుఃఖః మే, వ్యధిత పీడితుల వేదన తనదిగా అనుభూతి చెందుటవలన భయంకర వేదన యేర్పడుతుంది.

పీడిత మానవతయొక్క, విశ్వాత్మయొక్క, వ్యక్తి మరియు సమాజము యొక్క వ్యధ వేదనలు నాలో ప్రవేశించి నన్ను విచలితుడిని చేయుట మొదలెట్టాయి. కన్ను, పన్ను, కడుపు నొప్పితో బాధపడే వ్యక్తి ఏ ఉపాయముతో కష్టనివృత్తి జరుగుతుందాయని ప్రయత్నిస్తాడో, ఏమి చేద్దాము? ఎక్కడికి వెళ్ళాలి? అనే ఆక్రోశము నిరంతరము అతనిలో యేర్పడుతుందో? ఒక్క క్షణంకూడ ఆలస్యము చేయకుండా బాధ నివృత్తి కొరకు చేయగల్గే ప్రయత్నాలు ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆచరించటానికి ఆతురత పడుతాడో అటువంటి మానసిక స్థితి నాలో యేర్పడింది. ప్రమాదంలో కాలో చేయో విరిగి పోయిన పిల్లవాడిని, తల్లి తన జ్వరాన్ని

జలుబును కూడ మరచి ఆస్పత్రికి తీసుకు వెళ్ళుటకు ఎలా ఆతురత చూపిస్తుందో సుమారు నా మనోదశకూడ అప్పటి నుండి ఇప్పటి వరకు అలాగే వున్నది. నాకొరకు సుఖసాధనాలు జమచేసుకునే సమయము అసలు యెక్కడ వున్నది? విలాసపూరిత సామాగ్రి విషమువలె అన్పిస్తుంది. కొంచెము సేపు విశ్రాంతి తీసుకొని వినోదములో సమయము గడుపుదాము అనే మాట యెప్పుడు వచ్చినా మరణాసన్న రోగుల యొక్క ప్రాణము రక్షించగల్గే వీలువున్న ఒకగ్లాసు నీళ్ళను తన కాళ్ళు కడుక్కొవటానికి వుపయోగించుకునే వాడివలె ఆత్మగ్లాని కల్గేది. ఆకలితో ప్రాణాలు వదిలే స్థితిలో వున్న చిన్న పిల్లవాడి నోటి నుంచి ఆహారమును లాక్కుని తల్లి తన కడుపును యెలా నింపుకొనగలదు? బాధతో కాళ్ళు, చేతులు కొట్టుకుంటున్న పిల్లవాడిని వదిలి తండ్రి పేకాట , చదరంగము ఎలా ఆడగలదు? ఒక హృదయ హీనుడే ఇలా వుండగలడు. **ఆత్మవత్ సర్వభూతేషు** అనే సంవేదన ఎప్పుడు తీవ్రమైనదో, ప్రఖరమైనదో, క్రూరత్వము, నిర్ధయ మొదలైనవి, అందులోనే కాలిభస్మమై పోయినవి. కేవలం అంతఃకరణలో కరుణయే మిగిలినది. నా జీవితంలోని ఈ అంతిమ అధ్యాయంలో కూడ అది అలాగే ఉన్నది. దానిలో ఏ మాత్రము తగ్గుదల రాలేదు, రోజు రోజుకు అది పెరుగుతునే వున్నది.

ఆత్మజ్ఞానులు సుఖముగా వుంటారు. వారికి మంచి నిద్రపడ్తుంది అని విన్నాను. నాకు మాత్రము అటువంటి ఆత్మజ్ఞానము యింతవరకు దుర్లభముగానే యున్నది. అటువంటి ఆత్మ జ్ఞానము నాకు లభిస్తుందని అనుకోవటం లేదు. ప్రపంచములో ఎంతవరకు వ్యధ వేదనల యొక్క ఆస్తిత్వము వుంటుందో, ఎంతవరకు ప్రాణులు క్లేశకష్టముల అగ్నిలో కాలుతూ వుంటారో, **విశ్రాంతిగా కూర్చోవాలనే కోరిక నాకు యెప్పుడు రాకూడదు అనే భగవంతుడిని నేను నిరంతరము ప్రార్థిస్తున్నాను. నాకు శాంతి, సుఖము, సంతోషము, విశ్రాంతి అక్కరలేదు. పీడితుల వ్యధను నావ్యధగా అర్థముచేసుకొని అనుభూతి చెందగల్గే కరుణ కావాలి. నాకు సమృద్ధి అక్కర లేదు. ఇతరుల కంటి నీరు తుడవ కల్గుటలో తన సార్థకతను నిరూపణ చేసుకోగల్గే శక్తి  కావాలి. ఈ అనుదాన వరదానాలే భగవంతుని నుండి అడిగాను.** ద్రౌపదికి వస్త్రమునిచ్చి ఆమె లజ్జను కాపాడిన ఆ భగవంతుడు నన్ను కూడ కరుణ యొక్క అనంత సంవేదనలతో ఓతప్రేతము చేస్తున్నారనే అనుభూతి నాకు ఎప్పుడు ఉంటుంది. నాకు యేమి కష్టముంది, నాకు ఏమిలేదు అని ఆలోచించుటకు వ్యవధి ఎక్కడ వున్నది? నా మనస్సు నాకు యే సుఖసాధనాలు కావాలి అని ఎప్పుడు ఆలోచించలేదు. కేవలము పీడిత మానవత యొక్క వ్యధ వేదనలే నా రోమరోమములలో నిండిపోయి నా విశ్వవ్యాపి శరీరము, పరివారమును సుఖముగా వుంచుటకు ఏమి చేయాలనే ఆలోచనే నిరంతరమూ వున్నది. నేను పొందిన దానిలోని ప్రతి ఒక్క కణాన్ని ఈ లక్ష్యము కొరకే ఖర్చు పెట్టాను. శోక–సంతాపముల యొక్క వ్యాపకతను తొలగించి సంతోషముతో ఊపిరి పీల్చుకునే పరిస్థితులు ఏర్పడుటానికి కొంత సహాయము నేనుకూడ చేశాను.

**ఎన్ని రాత్రుల్లు నేను ఏడుస్తూ వెక్కుతూ చిన్న పిల్లల వలె ఎక్కిళ్ళు పెడుతూ ఏడుస్తూ**

**గడిపానో ఎంత మందికి తెలుసు. ప్రజలు నన్ను సంతుడని, సిద్ధపురుషుడని, జ్ఞానియని అనుకుంటారు. కొందరు రచయితయని, విద్వాంసుడని, వక్తయని, నేతయని అనుకుంటారు. కాని నా అంతకరణాన్ని తెరిచి చూసి ఎవరు అర్థం చేసుకున్నారు. ఎవరైన చూడగల్గితే ఈ ఎముకల గుడారములో మానవీయ వ్యధ వేదనల యొక్క అనుభూతులతో హాహాకారము చేస్తున్న, కరుణ ఆక్రందనలు చేస్తున్న, ఒక ఉద్విగ్న ఆత్మ ఏడుస్తూ ఉండటం కన్పిస్తుంది.** ఎక్కడ ఆత్మ జ్ఞానం ద్వారా పొందే నిశ్చింతత నిర్ద్వంధత ఎక్కడ కరుణాక్రందనలు చేసే నా అంతరాత్మ. ఈ రెండింటికి ఏ విధమైన పోలికా లేదు. అందువల్ల ఎప్పుడూ నేను అనుకుంటాను నిశ్చింతత ఏకాగ్రత మరియు సమాధి సుఖము యివ్వగల్గే జ్ఞానము నాకు చాలా దూరము. అవి నాకు దొరకవేమో కూడ. ఎందుకంటే ఈ బాధలోనే నాకు భగవంతుడు కన్పించినప్పుడు బాధాతప్తుల కన్నీరు తుడవటములోనే ఆనందం పొందగల్గినపుడు, నిష్క్రియమైన మోక్ష సమాధుల కొరకు నామనస్సు కోరుకుంటుందని అనుకోను. కోరికే లేకపోతే ఇక అది ఎలా లభిస్తుంది.

పుణ్యము, పరోపకార దృష్టితో నేను ఏదైన చేసినట్టు గుర్తులేదు. ఈశ్వరుణ్ణి ప్రసన్నము చేసుకొనుటకు సాధన చేసినట్టు నాకు స్మరణలేదు. **ఆత్మవత్ సర్వభూతేషు** అనే ఆత్మవిస్తార సాధన వల్ల సర్వత్రా నన్ను నేను దర్శించుకున్నపుడు ఇతరుల వ్యధ, వేదనలు కూడ నావిగా మారిపోయాయి. అవి ఎంతలా గ్రుచ్చుకొని బాధ కలుగ చేస్తున్నాయంటే వాటికి చేయగల్గే తక్షణ నివారణోపాయముల మీదే దృష్టి యుండేది. ఇక పుణ్య కార్యాలు ఎవరు చేస్తారు? పరమార్థము కొరకు ప్రయత్నం చేసే సమయమేది? ఈశ్వరుణ్ణి ప్రసన్నము చేసుకుని స్వర్గముక్తుల ఆనందం ఎవరి కొరకు? విశ్వ మానవుని పీడయే నా పీడ అయినపుడు మొదట దానిని నివారించుకోవాలిగదా. ఇక మిగతా విషయాలు అవకాశము, అవసరము వచ్చినప్పుడు ఆలోచించుకోవచ్చు. నా జీవితంలోని క్రియాకలాపాల వెనకాతల ఏమి ప్రయోజనము ఉన్నదో ఎవరైన తెలుసుకోవాలి అని ప్రయత్నిస్తే **ఎన్ని క్షణాలు సంతసజ్జనుల, సద్భావముల, సత్ప్రవృత్తుల, స్మరణ దర్శనము అవుతుందో అంతకాలము విశ్రాంతిగా ఊపిరి పీల్చుకున్నాను. ఎప్పుడెప్పుడు జనమానసముయొక్క వ్యధా వేదనలు ముందు నిల్చున్నాయో అప్పుడు నా వ్యక్తిగత పీడకంటే అధిక కష్టమును అనుభవించాను.** ఇది మీరు తెల్సుకొనగల్గితేచాలు. లోకమంగళము, పరమార్థము, సేవ మొదలగు ఏ ప్రయత్నాలు నాద్వారా ఎలా జరిగినా నా వివశత మాత్రమే. బాధ, మంట ఒక్క క్షణంకూడ నన్ను విశ్రాంతిగా కూర్చోనివ్వకపోతే నేనేమి చేయగలను. బాధతో శరీరము నిండి వున్నపుడు చేతులు, కాళ్ళు అటుయిటూ విసరకుండా ఎలా వుండగలను. ఇంతవరకు నేను చేసిన సమస్త ప్రయత్నములకు ప్రపంచం ఏ పేరు పెట్టినా, ఏ రంగుతో చూసినా సత్యమేమిటంటే విశ్వవేదన యొక్క అంతరిక అనుభూతి కరుణ సంవేదనల రూపం ధరించింది, నేను విశ్వవేదనను నా ఆత్మవేదనగా అనుభూతి చెంది దాని నుండి ముక్తి చెందుటకు బాధపడే వ్యక్తి చేసే ప్రయాసే చేస్తూ వున్నాను. భావనలు ఎంత ఉగ్రమయ్యాయంటే నన్ను నేనే మర్చిపోయాను. త్యాగము, సంయమనము, సింప్లిసిటీ, అపరిగ్రహము మొదలగువాటి దృష్టితో నా క్రియాకలాపాలను చూసేవారు

ఇది అర్థం చేసుకోండి. నా అంతఃకరుణను ఏ మూసలో పోసానో ఇవన్ని దాని స్వాభావికమైన పరిణతులు. సమృద్ధి, ప్రగతి, సుఖసామాగ్రి, మెప్పుదల నాకు యిష్టము లేదని నేను నిశ్చయముగా చెప్పలేను. వీటిని నేను కావాలని త్యజించాననేది సత్యం కాదు. నిజానికి విశ్వమానవుని వ్యధ నా అంతరంగ వేదనగా మారి నన్ను ఎలా ఆవరించిందంటే నా గురించి ఆలోచించి ఏదో చేయటానికి అవకాశమే దొరకలేదు. ఈ ప్రసంగం సర్వథా విస్మృతమే అయినది. ఈ విస్మృతిని ఎవరైన తపశ్చర్య అని, సంయమనమంటే అది వారిష్టము. కాని స్వజనులకు నా జీవన పుస్తకములోని ఉపయోగపడే కొన్ని పేజీలు తెరిచి చదివిస్తున్నపుడు వస్తుస్థితి తెలపటమే ఉచితము.

నా ఉపాసనా సాధన కలసి మెలసి జరిగేవి, భగవంతుడుని పరమాత్మని నేను ప్రకాశరూపంలో నా ఆత్మలో ప్రవేశించి తుచ్ఛతను గొప్పతనంగా మార్చమని ప్రార్థించాను. నాయొక్క క్షుద్రత ఆయన గొప్పతనంలో విలీనమవటానికి ఆయన శరణో కోరాను. ఒకే వరదానం ఆయనను కోరాను. నాలో అందరిని, అందరిలో నన్ను అనుభవించగల్గే సహృదయత విశాలత పొందాలని. 24 మహపురశ్చరణల యొక్క జప–ధ్యాన తప–సంయమనములు దీని చుట్టూరనే అల్లుకొనబడ్డాయి.

నా సాధనాత్మక అనుభూతులు ఆ మార్గములో వెళ్తున్నప్పుడు నేను యెదుర్కొన్న ఒడుదొడుకులు ఎందుకు చర్చిస్తున్నానంటే ఎవరైన ఆధ్యాత్మిక ప్రగతి దిశలో నడవాలని ప్రయత్నిస్తే నేటి పరిస్థితులలో ఏమి చేయ్యాలో అని తెలుసుకొనగల్గుతారు. వారికి నా జీవనయాత్ర ప్రత్యక్ష ఉదాహరణముగా మార్గదర్శనము చెయ్యగలదు. నిజానికి నేను ఒక ప్రయోగాత్మక జీవితాన్ని జీవించాను. ఆధ్యాత్మిక ఆదర్శములను వ్యవహారిక జీవితముతో కలుపుకుంటూ అంతరిక ప్రగతి మార్గంలో దారి తప్పకుండా ఎలా సఫలత పొందగలరో దీనివల్ల తెలుసుకొనగలరు. నేను వీటి గురించి అన్వేషించాను. ఈ ప్రయోగాలమీదనే నా ఆలోచనా ప్రక్రియ మరియు శారీరక గతి విధులను కేంద్రీకరించాను. ఈ దిశలో నా మార్గదర్శకుని పూర్తి సహాయ సహకారాలు లభించాయి. అందువల్ల అనవసరమైన విధి విధానాలలో ఇరుక్కోకుండా ఒక సూటి అయిన సాఫీ మార్గము మీద నడువగల్గాను. దాని గురించి ఈ పంక్తులలో ఎందుకు చర్చిస్తున్నానంటే ఆధ్యాత్మిక మార్గములలో నడుస్తూ సునిశ్చిత సఫలత పొందటానికి ప్రత్యక్ష ఉదాహరణగా, అనుకరించుటకు వారికి ఒక ప్రామాణిక ఆధారము నా జీవితము ద్వారా లభించగలదు.

ఆత్మిక ప్రగతి మార్గములో ఒక సునిశ్చిత క్రమబద్ధ యోజనానుసారం నడుస్తూ నేను ఒక హద్దు వరకు నా లక్ష్యాన్ని సాధించాను. దీనిని బట్టి నా పరిశ్రమ నిరర్థకము కాదు, నా ప్రయోగము సఫలమైనది అనీ ఖచ్చితముగా చెప్పగలను. ఏ సిద్ధులు విభూతులు ఉపలబ్ధులు పొందానో వాటి చర్చ నేను చేయుట ఉచితము కాదు. వీటి గూర్చి తెలుసుకొనుట, వినుట, పరిశోధనలు చేయుట, నేను శరీరం త్యజించుట తరువాతే జరగాలి. తద్వారా ఎన్ని ప్రమాణాలు వెదజల్లబడి కన్పిస్తాయంటే నమ్మని వాళ్ళను కూడ నమ్ముటకు వివశులను

చేయవచ్చు. ఆత్మ విద్యా విజ్ఞానము అసత్యము కాదు, ఆ మార్గముపైన పద్ధతి ప్రకారము అడుగులు వేసేవారికి ఆశించే సఫలత ఖచ్చితముగా లభిస్తుంది. ఈ మార్గాన్ని అనుసరించే వారికి ఆత్మశాంతి, ఆంతరిక శక్తి మరియు దివ్య అనుభూతుల పరిధిలో ఉండే లెక్కలేనన్ని ఉపలబ్ధులు ఎలా లభిస్తాయో తెలుస్తుంది. దీని ప్రత్యక్ష ప్రమాణము వెతికే వారికి రాబోయే రోజులలో ఆధ్యాత్మిక విధివిధానాల పరిశోధన చేసేవారికి నా జీవన ప్రక్రియ చాలా సహాయపడ్తుంది. సమయానుసారము ఇటువంటి శోధ కార్యము చేసేవారికి ఆ విశేషతలు విభూతుల యొక్క అగణిత ప్రమాణాలు, ప్రత్యక్ష ప్రమాణాలు బయట పెట్టి ఆత్మ వాది ప్రభుపరాయణ జీవితాన్ని పాటించిన నావలెనే అన్ని లభిస్తాయి.

# విశ్వాసము, సందేహము, సమాధానము

## ఫిబ్రవరి 1985 అఖండజ్యోతి

25 సంవత్సరముల బట్టి చేతనత్వము శరీరము కలిసిన నా భౌతిక ప్రయోగశాలలో నేను దత్తచిత్తుడనై ఒకే ప్రయత్నము చేస్తున్నాను. అది ఆధ్యాత్మిక తత్వజ్ఞానము యొక్క యదార్ధత మరియు ప్రతిక్రియ నిజానికి ఏమిటని తెలుసుకొనుట? వికసితమైన నేటి బుద్ధివాదుల దృష్టిలో ఆధ్యాత్మము భావకుల అంధవిశ్వాసము మరియు ధూర్తులు ఇతరులను మోసగించే వ్యవసాయము. ఈ మాటలు వాళ్ళ స్వనిర్మితజంజాలము అంటే నాకు అంత బాధ వుండేది కాదు. ఒక పక్క ఋషి ప్రణీతమైన, శాస్త్ర సమ్మతమైన, ఆప్తజనుల ద్వారా పరీక్షించబడి అనుమోదించబడినది అని చెప్పి విధానాలను పరీక్షించినప్పుడు అప్రమాణికమని చెప్పుట నన్ను చాలా బాధ పెడుతుంది. ఒక వైపు ఋషులు చెప్పిన చరమ సత్యము రెండో వైపు దానిని పాఖండము, అంధ విశ్వాసము అని చెప్పబడుతున్నపుడు మనస్సు వ్యాకులత చెంది ఈ సందర్భములో ఒక నిర్ణయాత్మక నిష్కర్ష పొందాలి అని అన్పిస్తుంది.

నేడు నాస్తికులు మాత్రమే దీనిని వెక్కిరించుట లేదు. ఆస్తికులు కూడా చెప్పబడిన క్రియాకృత్యములను దీర్ఘకాలము పాటు చేస్తున్నప్పటికి వారు సంతోషించి ప్రసన్నత వ్యక్త పరచేది యేమి లభించలేదు అని చెప్తున్నారు. ఈ పరిస్థితులలో సిద్ధాంతాలు మరియు ప్రయోగాలలో ఎక్కడో తృటి ఉన్నది అన్పిస్తున్నది. ఈ తృటిని నివారించి ఆధ్యాత్మికత యొక్క యధార్ధతను ప్రకాశములోకి తీసుకురావటానికి కొన్ని ఖచ్చితమైన ప్రయత్నాలు లక్ష్యశుద్ధితో చేయవలసిన అవసరమున్నది. మరి ఈ పనిని ఎవరు చేస్తారు ? అప్పుడు నాకు అన్పించినది దీని గూర్చి నాకు ఇంత ప్రేమున్నప్పుడు ఈ బాధ్యత నేనే స్వీకరించాలి. ఆధ్యాత్మికత ఒక విజ్ఞానమే అయితే దాని సిద్ధాంతాలు యధార్ధమై యుండాలి. మరియు వైజ్ఞానిక ఉపకరణములతో చేసే ప్రయెగాలలాగే దీని పరిణామములు తత్కాలమే లభించాలి. ప్రతిపాదన మరియు పరిణామము యొక్క సమన్వయము జరుగనప్పుడు ప్రజలు ఆధ్యాత్మికతను కేవలం ఆడంబరమంటే తప్పేముంది. కాని ఆధ్యాత్మికత సత్యమే అయితే దాని గూర్చి చెప్పబడే మహత్యములు నిజమే అయితే దీనిని ఇతర విజ్ఞానముల వలె అందరు లాభం పొందగలిగే స్థితిని ఎందుకు తీసుకొనిరాకూడదు ?

నా గత 25 సంవత్సరముల జీవితక్రమము ఈ దిశలోనే గడచినది. దీనిని ఒక జిజ్ఞాసు సాధకుని ప్రయోగ పరీక్షణ అనుకుంటే అతిశయోక్తి కాదు.

ఘటనా క్రమము నా 15 సంవత్సరముల వయస్సులో ఆరంభించబడినది. ఇప్పుడు 60 సంవత్సరముల కంటే ఎక్కువ సమయము గడిచిపోయినది. దీని కంటే ముందు అపరిపక్వమైన బుద్ధి కఠోర ధృడత్వాన్ని పాటించగల్గే స్థితిలో లేదు. మనస్సులో తీవ్ర ఉత్కంఠ కూడా లేదు. మొదటి రోజులలో వచ్చిన జిజ్ఞాస, దానికి

సంబంధించిన అనేక పుస్తకాలు చదువుటలో మరియు అనేక మంది ప్రతిష్ఠితుల, సిద్ధుల సాన్నిధ్యములో గడచినది. ఇది వ్యక్తిగత లాభము పొందుటకు సిద్ధులను పొందాలనే లిప్స కాదు తథ్యములను తెలుసుకునటకు ఎంత కఠినశ్రమైన చెయ్యగలిగే సాహసము. **అడగటము, అధ్యయనములతో సమాధానము లభించనప్పుడు నా యొక్క ఈ ఉత్కంఠ అంతరిక్షములో భ్రమణము చేయటం మొదలెట్టినది. ఒక సకల విద్యాపారంగతుడైన మహాత్ముడిని నాకు సహాయపడటానికి వెతుక్కుని తీసుకువచ్చినది.**

బ్రాహ్మణ కులములో జన్మించుట వలన మరియు పౌరోహిత్య, కర్మకాండ పరంపరతో అతి దగ్గర సంబంధము ఉండుట వలన నాకు 10 సంవత్సరముల వయస్సు ఉన్నపుడు మహామనా మాలవ్య గారి ద్వారా నా తండ్రి గారు ఉపనయనము చేయించి గాయత్రిమంత్ర ఉపాసన యొక్క సరళ కర్మకాండ నేర్పారు. ఈ గుహ్యవిద్య యొక్క ఇతర పక్షములు నాకు తరువాత విదితమయ్యాయి. నిర్ధారిత సాధనాక్రమము అలాగే కొనసాగుతూ వచ్చింది. మరియు లక్ష్యము పొందటానికి జిజ్ఞాస క్రమక్రమంగా ప్రచండమైంది. ఈ ఉద్వేగములో ఎన్నో రాత్రులు నిద్రపోకుండా గడిపాను. పూజా గృహము ఒక ప్రక్క ఏకాంతములో ఉన్నది. ఆ రోజు బ్రహ్మముహూర్తములో పూజా గది దివ్యగంధము మరియు దివ్య ప్రకాశముతో నిండినది. చేతి నుండి మాలజారిపోయినది. మనఃస్థితి ఒక తంద్రాగ్రస్థుని వలే అయినది. నా ముందు మన అందరి ఊహలలో ఉండే ఒక ఋషి రూపము ప్రకాశపుంజరూపములో సాక్షాత్కరించింది. ఈ దివ్యదర్శనము నాలో ఏ గాబరా ఉత్పన్నము చేయలేదు. అంతేకాక నా తంద్ర ఇంకా గాఢతరమైనది. మరియు శరీరాధ్యాసము పూర్తిగా పోయి నా చేతనత్వము యింకా చైతన్యవంతమైనది. ప్రకటితమైన సత్తా కొన్ని సంక్షిప్త శబ్దములుచ్చరించింది. “నీ పాత్రత, కోరిక నాకు తెలుసు అందువల్ల సహాయము అందించుటకు పరుగెత్తుకుంటూ వచ్చా. నీ పాత్రతను ఇంకా వికసింప చేసుకొనుటకు మహాప్రజ్ఞ యొక్క ఒక సమగ్ర తపోసాధన చేయి”. ఆయన ఉద్దేశము ఒక సంవత్సరములో గాయత్రీ మహామంత్రము యొక్క ఒక పురశ్చరణ చేస్తూ 24 సంవత్సరములలో 24 మహాపురశ్చరణములు సంపన్నము చేయుట. విధి విధానాలు ఆయన క్లుప్తముగా చెప్పారు. ఈ అవధిలో బార్లీతో చేసిన రొట్టెలు మజ్జిగ మాత్రమే తీసుకోమని ఆజ్ఞాపించారు. తద్వారా ఇంద్రియ సంయమనము నుంచి అర్థ సంయమనము, సమయ సంయమనము, ఆలోచనా సంయమనముల వరకు అన్ని మనో నిగ్రహ ప్రక్రియలు సంపన్నమగుటయే కాక తత్వజ్ఞానమును ధారణ చేయగల్గే పాత్రత పరిపక్వమౌతుంది. ఇంతవరకు నేను చెప్పింది చేస్తే ఆ తరువాత మళ్ళీ వచ్చి నేను మార్గదర్శనము చేస్తాను అనే ఒక సంకేతాన్ని అందచేసారు. అంతర్ధానమయ్యారు.

జిజ్ఞాస గలిగిన మస్తిష్కము భగవంతుడిచ్చాడు. తర్కబుద్ధి కూడా తక్కువ యివ్వలేదు. ఆశ్చర్యమేమిటంటే ఈ స్థాయి విచారణతో పాటు అంత ప్రచండ శ్రద్ధ మరియు సంకల్ప శక్తి భాండాగారము ఎక్కడనుండి ఎలా వచ్చింది. ఇవి రెండు విపరీత దిశలు. కాని నా మానసిక సంరచనలో ఈ పరస్పర విరోధిస్థితుల కలయిక జరిగినది. రెండవ రోజు నుంచే 24 సంవత్సరముల సాధనాక్రమము సమగ్ర నిష్ఠా సంకల్పముతో మొదలెట్టాను. కుటుంబీకులు బంధువులు 24 సంవత్సరముల పాటు ఈ ప్రయోజనం కొరకు నేను ప్రతిరోజు 7 గం॥లు

సమర్పిస్తాను అనే సుదీర్ఘ ప్రక్రియ గురించి విని బాధపడ్డారు. వారి, వారి విధానములతో నన్ను దీని నుండి విముఖుడను చేయుటకు ప్రయత్నించారు. కేవలం బార్లీ మీదే ఆధారపడి యింత దీర్ఘ కాలం ఉండుట శరీరానికి హాని కలుగచేస్తుంది. చదువు మాని వేస్తే భవిష్యత్తు ఏమౌతుంది ఇలా రకరకాలుగా బోధించారు. క్లుప్తముగా అందరూ చెప్పే విషయము ఒకటే ఇంత సుదీర్ఘ కఠోర సాధన చేయవద్దు. కాని నా జిజ్ఞాస ఎంత ప్రచండమైనదంటే ఆధ్యాత్మికత యొక్క తాత్వికతను తెలుసుకొనుటకు ఒకటేమిటి ఇటువంటి అనేక శరీరాలు బలియిచ్చి వేసే మనోబలము పెల్లుబుకుతో వచ్చేది. నన్ను మార్గచ్యుతుడను చేయుటకు ప్రయత్నించే వారికి నా నిశ్చిత అభిప్రాయము స్పష్ట శబ్దములతో చెప్పేవాడిని. ఇంటిలో జీవించుటకు తగిన సాధన సామాగ్రి ఉండుటవలన దాని గురించి చింతించవలసిన అవసరం లేకపోయింది.

ఒక దాని తరువాత ఒకటి సంవత్సరములు గడిచిపోయినవి. అడిగిన వాళ్ళందరికి యెప్పుడు ఒకే జవాబు యిచ్చేవాడిని, "ఒక జూదము ఆడాను. చివరిలోనే దీని ఫలితాలు తెలుస్తాయి". 24 సంవత్సరములు ఒక దాని తరువాత ఒకటి ఈ విధివిధానముతోనే పూర్తి అయ్యాయి. ఏడు గంటల నిత్య జప ప్రక్రియతతో విసుగెత్తలేదు. బార్లీ గింజల రొట్టె, మజ్జిగ ఆహారం ఆరోగ్య దృష్ట్యా అపూర్ణము హానికరము అని చెప్పబడింది. కాని అలా ఏమి జరుగలేదు. దీర్ఘకాలము సుదీర్ఘ ప్రక్రియలతో చేసే సాధనాక్రమము యధావిధిగా కొనసాగింది. ఎప్పుడూ నాకు విసుగన్పించలేదు. రుచి తగ్గలేదు. ఈ అవధిలో మనోబలం తగ్గలేదు యింకా పెరిగింది కూడా. 24 సంవత్సరములు పూర్తి అయ్యే రోజు దగ్గర పడ్తున్న కొద్ది మనస్సులో ఇటువంటి సుదీర్ఘ సాధనా క్రమము మరోకటి చెప్తే దానిని కూడా ఇంత ప్రసన్నముగా చేయగలను అని అనుకునేవాడిని. ఫలితాల కొరకు ఇంకా కొన్ని జన్మలు ప్రతీక్షించగలను. ఈ పంక్తులు ఆత్మకథగా వ్రాయుట లేదు. లేక అప్రాసంగిక విషయాలు పలుకుట లేదు. ఆధ్యాత్మకత కూడా ఒక విజ్ఞానమేనా? ఈ ప్రయోగ పరీక్షణల సందర్భములో నేను యేమి చేసానో చర్చిస్తున్నాను. దీని వల్ల ఇతర జిజ్ఞాసులకు కూడా కొంత ప్రకాశము మరియు సమాధానము లభిస్తుంది.

ఈ 24 సంవత్సరములలో ఏ శాస్త్రము అధ్యయనము చేయలేదు. విద్వాంసులు, విజ్ఞజనులతో ఏమి చర్చించలేదు. ఎందుకంటే దీని వల్ల నిర్ధారిత దిశ మరియు శ్రద్ధలో వ్యతిరేకము సంభవించవచ్చు. కాని ఆధ్యాత్మికత యొక్క మూలభూత ఆధారము ప్రచండ ఇచ్ఛ మరియు గహన శ్రద్దలు. దిశా విభ్రమవల్ల అంతరంగము డోలాయమానము కాకుండా ఉండుటకు ఈ ప్రయోగము ఏకనిష్ట భావనతో జరగాలి కనుక అదే చేశాను. మనస్సు పగలే కాదు రాత్రి స్వప్నావస్థలో కూడా ఇదే మార్గంలో నడిచేది.

నియమించబడిన అవధి బాధగా అన్పించలేదు. క్రమక్రమముగా యింకా రసపూర్ణమైనది. నిర్ధారిత సమయము పూర్తి అయినది. ప్రకాశపుంజ మార్గ దర్శకుడు మొదట కన్పించిన స్థితిలోనే మళ్ళీ దర్శనమిచ్చాడు. బ్రాహ్మ ముహూర్తములోనే మూగ భాషలో అడుగబడినది. 'ఈ 24 సంవత్సరములలో ఏమైనా చిత్ర విచిత్ర అనుభవాలు వచ్చాయా, చెప్పు ?' నా

జవాబు ఒకటే 'నిష్ఠ పెరుగుతూ వచ్చింది, తరువాతి ఆదేశమును ఇంత కంటే ఎక్కువ తత్పరత మరియు తన్మయత్వముతో చేస్తాను. నాది ఒకే ఒక ఆకాంక్ష. ఆధ్యాత్మికత ఆడంబరమా లేక విజ్ఞానమా ? దీనిని స్వయముగా అనుభూతి చెంది దీని గురించి ఇతరులకు గట్టిగా నొక్కి వొక్కాణించగల్గాలి'.

నేను చెప్పటం పూర్తి అయినది. మార్గదర్శకులు ఇలా అన్నారు. విశ్వాసాన్ని వృద్ధి పరుచుటకు యింకొక పుటము పెట్టవలసియున్నది. అప్పుడే అది సముచిత రీతిలో పరిపక్వమౌతుంది. దీని కొరకు 24 లక్షల ఆహులతో గాయత్రీ యజ్ఞం చేయవలసియుంటుంది'. నేను ఇలా అన్నాను 'శరీర గతక్రియలు నేను చేయగలను. కాని ఇంత పెద్ద కార్యక్రమానికి డబ్బు సమకూర్చుకొనుట మరియు దీని కొరకు చేయు ప్రయత్నములలో అనేక ఎగుడు దిగుడులు ఎదుర్కొనవలసి వస్తుంది. నా దగ్గర ధనము లేదు, అనుభవము లేదు. ఇంకా ఈ మీ క్రొత్త ఆదేశాన్ని ఎలా నిభాయించగలను'?

మృదుదరహాసముతో ఆ ప్రకాశ పుంజము యిలా అంది. 'చూశావా విశ్వాసము తగ్గినది. నా వాక్కు , గాయత్రీ సాధన వల్ల ఏమి సంభవము కాదు ? ఇందులో అసలు సందేహము ఎలా వచ్చినది ? ఇది నీలో ఉన్న పచ్చిదనము, అపరిపక్వం. దీనిని తీసివేయాలి. నూటికి నూరు శాతము శ్రద్ధా బలము వల్లనే పరిపక్వత లభిస్తుంది'.

నేను లొంగిపోయి ఇలా అన్నాను 'ప్రణాళిక చెప్పి వెళ్ళండి. నేను యిటువంటి పనులలో ఏమి తెలియనివాడిని' ఆయన క్లుప్తముగా కాని సమగ్రముగా ఒక వెయ్యి కుండీలతో 24 లక్షల ఆహుతులతో గాయత్రీ యజ్ఞం ఎలా చేయాలో తెలిపారు. ఆ రోజులలో ఉన్న ఒక లక్ష ప్రముఖ గాయత్రీ ఉపాసకుల్ని ఎలా పిలవాలో కూడా తెలిపారు. మార్గంలో వచ్చే కష్టాలు వాటంతటవే నివారింపబడుతాయి అని తెలిపారు.

రెండవ రోజు నుంచే పని మొదలెట్టాను. సంవత్ రెండువేల పదిహేను కార్తీక పౌర్ణమి ముహూర్తము (నవంబరు 26, 1958) నాలుగు రోజుల ముందు నుండి కార్యక్రమము మొదలెట్టవలసియున్నది. ఒక లక్ష మంది ఆగంతకులు మరియు దీనికి రెండు మూడు రెట్లు దర్శకులు కూర్చునుటకు, నివసించటానికి, భోజనము చేయుటకు, పడుకొనుటకు, శుభ్రంగా ఉంచుటకు వెలుతురు, నీరు మొదలగు అనేకానేక కార్యాలు పరస్పరం ఒకదానితో ఒకటి సంబధించినవి ఉన్నాయి. అప్పటికప్పుడు మనసుకు ఎలా తోస్తే అలా చేసుకుంటూపోయాను. ఆగంతకుల చిరునామా పెన్ను దానంతట అదే వ్రాసుకుంటూ పోయింది. ఈ కార్యక్రమానికి 6, 7 మైళ్ళ అవసరం. కొంత ఖాళీ జాగా లభించింది, మిగతాది అడిగితే రైతులిచ్చారు. టెంటులు, షామియానాలు, ఆహార సామాగ్రి, బావి నుండి నీళ్లు తోడే పంపులు, జనరేటర్లు ఎవరు ఇవ్వగల్గేవి వారు ఇచ్చుటకు సిద్దపడ్డారు. ఇటువంటి పనులలో అడ్వాన్సు ఇవ్వటం అనేది పద్దతి. కాని ఎవరూ అడగలేదు నేను ఇవ్వలేదు. వారు వారి డబ్బు ఎలా లభిస్తుందని విశ్వసించారో తెలియదు. మొత్తం ఏర్పాట్లు చేయుటకు నెలకంటే తక్కువ సమయంము పట్టింది. సహాయం కొరకు స్వయంసేవకులు కావాలి అని పత్రికలో ప్రకటిస్తే చూస్తూ చుస్తూ 500 మంది స్వయంసేవకులు ఏర్పడ్డారు. అందరూ కలసి మెలసి కార్యక్రమాన్ని తమ చేతులలోనికి తీసుకున్నారు.

నియత సమయంలో నిమంత్రణ అందుకున్న ఒక లక్ష గాయత్రీ ఉపాసకుల సమూహము వచ్చినది, వారితో పాటు దర్శకుల గుంపు కూడా వచ్చినది. సుమారు 10 లక్షల మంది వచ్చి ఉంటారని అంచనా. రైల్వే స్టేషను, బస్‌స్టాండులలో అపారమైన జనసముద్రము కన్పించినది. కొంతమంది మంచి హృదయము గల ఆఫీసర్లు ప్రత్యేక రైళ్లు, బస్సులు వేశారు. మధుర నుండి 4 మైళ్ల దూరంలో యజ్ఞస్థలమున్నది. తమ తమ వస్తువులను శిరస్సు పై పెట్టుకుని వస్తూనే ఉన్నారు. ఒక లక్షమంది ఉండుటకు ఏర్పాటు చేసిన వ్యవస్థలో 4 లక్షల మంది యిమిడిపోయారు. 24 గంటలు నిరంతరము భోజనాలు జరుగుతూనే ఉన్నాయి. నీడ దొరకలేదు, ఆకలిగా ఉన్నామనే ఫిర్యాదు రాలేదు. బావులకు పంపులున్న వాళ్లు తమ తమ పంపులను పెట్టారు. విద్యుత్తు సరఫరా తగ్గితే దూర దూరముగా ఉన్న గ్రామాల నుండి గ్యాస్‌లాంతర్లు వచ్చాయి. టాయిలెట్స్, స్నానముల సమస్య అన్నింటి కన్నా క్లిష్టమైనది. ఇవి కూడా ఎంత సువ్యవస్థతతో ఏర్పాటు చేయబడినదంటే, చూసేవాళ్లు ఆశ్చర్యచకితులయ్యారు.

ఈ అడవిలో దగ్గర డబ్బు ఉంచుకొవద్దు. సురక్షితముగా ఆఫీసులో జమ చేయండి అని చెప్పబడినది. అందరూ దీని ప్రకారం తమ దగ్గర ఉన్న ధనమును సురక్షితముగా ఉంచుటకు ఆఫీసులో జమ చేశారు. అంతా వ్యవస్థతో కూడినదే. ఎవ్వరిది ఒక్క పైసా కూడా పోలేదు. చూసిన వాళ్లు ఈ కార్యక్రమాన్ని అలహాబాదులో జరిగే కుంభమేళాతో పోల్చారు. గవర్నమెంట్, పోలీసుల సహకారము ఎంతమాత్రము లేదు. అనేక మంది తమ వైపు నుండి డిస్పెన్సరీలు, స్వల్పాహార కేంద్రాలు, మంచినీటి కేంద్రాలు ఏర్పరచారు. మైళ్ళ ఏరియా మనుష్యులతో పూర్తిగా నిండిపోయింది. నిర్ధారిత సమయంలో యజ్ఞము విధిపూర్వకముగా జరుగుతూనే యున్నది. యజ్ఞశాల పరిక్రమ చేయుటకు 30 – 50 మైళ్ళ దూరం నుండి బస్సులు వేసుకుని వచ్చారు. పూర్ణాహుతి రోజున నేను నా ధర్మపత్ని, రోజల్లా చేతులు జోడించి నిల్చునే ఉన్నాము. అందరిని ప్రసాదము (భోజనము) స్వీకరించి వెళ్ళమన్నాము. భగవంతుడికి తెలియాలి దాని ఖర్చులు ఎవరిచ్చారో. ఎక్కడి నుండి భోజన సామాగ్రి వచ్చినదో. ఎవరు ఇంత విశాల భోజన సామాగ్రిని తిన్నారో. అన్నింటికంటే ఆశ్చర్యకరమేమిటంటే ఎవ్వరూ ఒక్క పైసా కూడ పోగొట్టుకొనలేదు. ఎవరికి దెబ్బలు తగలలేదు.

ఎవరూ తప్పిపోలేదు. ఎక్కడి నుండి డబ్బు వచ్చిందో ఎటు వెళ్ళిందో తెలియదు. బేరీజు యొక్క కొన్ని బస్తాలు మిగిలాయి. వాటితో క్లీనింగ్ ప్రాసెస్ నిర్వహించాము. స్వయంసేవకులకు టిక్కెట్లు ఇప్పించాను. మిగిలేది ఏముంటుంది కాని నష్టపోలేదు. ఇసుకతో నిండిన బస్తాలు గోధుమపిండిగా మారటం, నీరు నెయ్యిగా మారటం అనే కింవదంతి ఇక్కడ నూటికి నూరు పాళ్ళు సత్యమైనదని చూసిన వాళ్ళు అన్నారు. కుంభమేళకు ఉండే సంరక్షకులు కాని, బడ్జెటు కాని, టాక్స్ మొదలగు వ్యవస్థలు యిక్కడ లేవు. అయినా మొత్తం వ్యవస్థ ఒక యంత్రం వలె సాఫీగా గడిచిపోయింది. మధుర, దాని చుట్టూరా వంద మైళ్ళ ప్రాంతంలో మహాభారతం తర్వాత ఇంత పెద్ద కార్యక్రమము జరుగుతోంది, దీనిని చూడని వారికి జీవితంలో మళ్ళీ ఇటువంటి అవకాశం దొరకదు అనే జనశృతి వల్ల మొదటి నుండి చివరి రోజు వరకు సుమారు 10

లక్షల మంది ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. కార్యక్రమము పూర్తి అయిన తరువాత కూడా 3 రోజుల వరకు యజ్ఞశాల ప్రదక్షిణలు జరుగుతూనే ఉన్నాయి. కుండములలోనున్న భస్మము ప్రసాదముగా తీసుకొని వెళ్ళారు.

నిజానికి ఈ కార్యక్రమము అన్ని దృష్టికోణాలలో ఒక అలౌకిక దర్శనీయ కార్యక్రమము, వెయ్యి కుండముల భవ్యయజ్ఞశాల. ఒక లక్షమంది ప్రతినిధులు కూర్చోగల్గే పండాలు. 24 గంటలు నిరంతరము జరిగే భోజన వ్యవస్థ, వెలుతురు, నీరు, పడుకోవటానికి జరిగిన ఏర్పట్లు ఎక్కడ చూసినా ఆశ్చర్యమే. 7 మైళ్ల విస్తారములో జనసందోహము నిండి పోయింది. పూర్ణాహుతి తరువాత కూడా మూడు రోజుల వరకు భోజనం చేస్తూనే ఉన్నారు. అక్షయభాండారము అలాగే కొనసాగినది. మొదట ఆరంభంలో వచ్చినవారు దీని గురించి చర్చించటం వల్ల బస్సులు, ఎద్దుబండ్ల సమూహము పెరుగుతూవచ్చినది. ఈ జనసాంద్రము భవ్యతచూసి వచ్చిన ప్రతి వ్యక్తి అవాక్కయిపోయేవారు. ఇటువంటి దృశ్యాన్ని నిజానికి ఈ లక్షలాది మందిలో ఎవరూ ఇంతవరకు చూడలేదు.

గాయత్రీ మహా పురశ్చరణ యొక్క జప–తప–సాధన మరియు పూర్ణాహుతి యజ్ఞము గూర్చి చర్చించాను. ఈ యజ్ఞము యొక్క అతి పెద్ద ఉపలబ్ధి యేమిటంటే నిమంత్రణ అందుకున్న అపరిచితులైన సుమారు ఒక లక్ష గాయత్రీ ఉపాసకులు నా మిత్రులుగా సహకరించేవారుగా ఘనిష్టులయ్యారు. దగ్గరయ్యారు. భుజములతో భుజములు కలిపి పనిచేయగల్గే వారుగా మారారు. చూస్తూ చూస్తూ గాయత్రీ పరివార్ యొక్క ఇంత విశాల సంఘటన నవయుగ సూత్రపాత క్రియాకలాపముల నిమిత్తము ఒక సునిశ్చిత ప్రణాళికతో చాలా ముందుగానే తయారు చేసిపెట్టారా అన్నట్లు నిర్మించబడినది.

## చమత్కారములతో కూడిన నా జీవన క్రమము మరియు దాని మర్మము.

## మార్చి 1985 అఖండజ్యోతి

గత 60సంవత్సరాల నా జీవితము అలౌకిక సంఘటనలతో కూడిన, దైవీ చేతనత్వము యొక్క మార్గదర్శములో నిర్దేశించబడిన ఎటువంటి కథ–గాథ అంటే, దానిలోని అనేక పక్షములు ఇప్పుడు కూడా జనసాధారణములో బహిర్గతము చేయకూడదు. మొట్టమొదటిసారి నేను మార్గదర్శకుని నిర్దేశానుసారము నా జీవన యాత్రలోని కొన్ని రహస్యమయ సంఘటనలను ప్రకటీకరణ చేయటానికి నిశ్చయించుకున్నాను. దీనివల్ల అనేకులకు ఆధ్యాత్మిక జీవిత విధానములో సవ్యమైన దిశ లభిస్తుంది. కొన్ని సంఘటనల గురించి మీరు ముందే తెలుసుకున్నారు. అనేకులకు ఋద్ధి సిద్ధుల గురించి తెలుసుకోవాలని ఎక్కువ జిజ్ఞాస ఉంటుంది. నా గురించి సిద్ధ పురుషుడను అనే మాన్యత జనమానసములో ఏర్పడుతున్నది. నేను ఎంత కాదన్నా మరియు ఆధ్యాత్మిక దర్శనము యొక్క సత్యమును అందరి ముందు ఉంచినా నేను ఒక చమత్కారి సిద్ధ  పురుషుడను అనే భావన అన్ని వైపుల సంవ్యాప్తమై ఉన్నది. ఈ వసంత పర్వదినాన నా జీవన గాధను ఒక తెరచిన పుస్తకము వలే అందిరికి తెలియచేయమని నిర్ధేశము ఇవ్వబడినది. తద్వారా అందరూచమత్కారాలు మరియు వాటికి జన్మనిచ్చే సాధనాశక్తి సామర్థ్యములతో పరిచితులు కాగలరు.

ఋద్ధిలు మరియు సిద్ధులు ఏమిటి? ఈ సంబంధంలో నా దృష్టికోణము చాలా స్పష్టమైనది. అది శాస్త్రసమ్మతము మరియు తర్కప్రతిపాదనలతో నిరూపించగలిగేది. నా ప్రతిపాదన ఏమిటంటే ఆధ్యాత్మిక సాధనలను, యోగాభ్యాసము మరియు తపశ్చర్య అనే రెండు భాగాలుగా విభజించవచ్చు. ఇందులో తపశ్చర్య ప్రత్యక్షమైనది. యోగాభ్యాసము పరోక్షమైనది. తపస్సు శరీరప్రధానము. యోగము మనోప్రధానము. వీటి సాధనా ఫలితాలు కూడా వేరువేరుగా ఉంటాయి.

ఒకటి సిద్ధి, రెండవది ఋద్ధి. మామూలు శరీర సామర్థ్యముతో సాధ్యముకాని పెద్ద పనులను చేసి చూపించేది సిద్ధి. ప్రాచీన కాలములో వర్షము ఇప్పటికంటే ఎక్కువ కురిసేది. నదులు కాలువలు చాలా వేగముతో ప్రవహించేవి. వాటి మీద బ్రిడ్జిలు లేవు. పడవల మీదే ఆధారపడ వలసి ఉండేది. నదీప్రవాహము వేగవంతము అయినపుడు, వాటిలో సుడిగుండాలు ఏర్పడినప్పుడు పడవల రాకపోకలు కూడా ఆగిపోయేవి. అత్యవసర పనిపడినపుడు తపము చేసుకునేవారు నీళ్ళమీద నడచి దాటివేసేవారు. వీళ్ళు ఆకాశములో కూడ ఎగర గలిగేవారు. రావణ సభలో సభాసదులందరూ కలసికూడ అంగదుని కాలు కదపలేకపోయారు. ఇది ఒక విధమైన సిద్ధి. సురస నోరు పెద్దది చేసి హనుమంతుని మింగటానికి చేసే ప్రయత్నము, హనుమంతుడు తన శరీరాన్ని అంతకటే రెట్టింపు చేయడము, చివరికి ఒక దోమవలె సూక్ష్మ రూపము ధరించి బయటపడటము, అనేవి సిద్ధి శ్రేణిలోకి వస్తాయి. తపము ద్వారా శరీరములో ఉన్నది అసామాన్య సామర్థ్యములను వశము చేసుకోవచ్చు.

ఋద్ధి ఆంతరికమైనది. ఆత్మికమైనది. సాధారణ వ్యక్తి తన మనస్సుతో ఎంత గ్రహించగలడో దానితో పోల్చి చూస్తే అత్యధిక మనోబలము ఇచ్ఛాశక్తి యొక్క భావప్రభావము ఋద్ధి శ్రేణిలో వస్తాయి. శాప–వరదానల సామర్థ్యము ఋద్ధిశ్రేణిలోకి వస్తాయి. అతి చల్లని ప్రదేశములో జీవించగలుగుట.

అన్నము, జలము లేకుండా జీవించగలుగుట, ఆయువుని సాధారణవ్యక్తుల కంటే చాల ఎక్కువపొడిగించగలుగుట ఇవి సిద్ధి శ్రేణిలోకి వస్తాయి. మనోబలము ఎవరిది చాల ఎక్కువగా ఉంటుందో అతను తన ప్రతిభతో ఇతరులను ప్రభావితము చేయగలడు. తపస్వి తన శారీరక సామర్థ్యములతో స్థానాంతరణ చేయగలగుతాడు. పరకాయప్రవేశము, శక్తిపాతము, సిద్ధిశ్రేణిలోకి వస్తాయి. ఋద్ధి యొక్క అనుదానలతో వ్యక్తిత్వము, చరిత్ర మరియు మానసికస్థితిని పెంపోందించగలము.ఎవరి వద్ద ఋద్ధి యొక్క బాహుళ్యము ఉన్నదో అతను తన విశేషతను స్థిరముగా ఉంచుకుంటూ ఇతరులకు కూడా తను అనుదానాలను ఇచ్చి వారికి లాభము చేకూర్చగలడు. పదార్థముల స్వరూపములను మార్చివేసి వాటి పరిణామాన్ని చాల ఎక్కువగా మార్చగలిగే సామర్థ్యముకూడా సిద్ధపురుషులు చేసే పనియే. సాధనతో ఇవన్ని కూడా సంభవమే.

ఋద్ధి సిద్ధులు ఎన్నిరకాలుగా ఉంటాయి? వాటిని ఏవిధముగా పొందగలము?వాటి ఉపయోగాలు ఏమిటి?వాటి వివరణ యోగగ్రంధాలు, తంత్రములు, విజ్ఞజనుల ద్వారా నేను తెలుసుకున్నాను. ఎలా ప్రయోగించాలో కూడా అనుభవములోకి తెచ్చుకున్నాను. కాని నేను వీటిని ఎపుడు ప్రత్యక్షముగా ప్రయోగించలేదు. నిజానికి వీటి అవసరము నాకు ఎప్పుడు కలగలేదు. నిజానికి ఏరోజైతే నాకు గొప్ప మార్గదర్శకుని సాక్షాత్కారమైనదో ఆరోజు నుంచే నా కోరికలన్ని సమాప్తమైపోయాయి.ఇక ఆరోజు నుంచి నాలో ఒకే ఆశంక మిగిలింది. అదేమిటంటే మార్గదర్శక సత్తా యొక్క సంకేతము ఎపుడు ఏ నిమిత్తము కొరకు లభిస్తుందో దానిని పరిపూర్ణ తత్పరత, తన్మయత్వముతో పూర్తి చేయగలగాలని.

ఆదేశము ఎపుడు లభించినా దానిని పూర్తిచేయుటకు కావలసిన సహయకులు, సాధనలు విధి, విధానాలు ఏవేవి అవసరమో అవి నాకు అవసరమైనపుడల్లా నిరంతరము లభిస్తూఉండేవి. ఋద్ధి, సిద్ధి అవసరము దీనికొరకే కదా ! వాటిని నేను ప్రయోగిస్తే వ్యర్ధ అహంకారము ఏర్పడి వ్యక్తిత్వము పతనోన్ముఖము అయ్యేది. అందువల్ల ఋద్ధి, సిద్ధిల ఉపలబ్ధుల కొరకు విధివిధానాలను తెలుసుకొని వాటిని ప్రయోగించేవిధానము తెలిసినా వాటిని ప్రయోగించే అవసరము రాకపోవుట నాకు మేలే చేసింది. అతిశయ దుష్కర పనులు వాటంతట అవే జరుగుతూ వచ్చాయి. దానిని భగవంతుని అనుగ్రహముగా ఆదేశముగా చెప్పి, నేనేదో చాలా ప్రయత్నము చేసాను అని గొప్ప చెప్పుకోలేదు. అహంకారము తెచ్చుకొనే అవసరము ఎప్పుడు రాలేదు. ఇది మంచిదే కదా ! నా వ్యక్తి గతమైన ప్రణాళిక ఏమి లేదు. అందుకని సిద్ధులు సంగ్రహించుకొనే అవసరము లేదు.దివ్య ఆదేశము లభించినపుడు దాని పూర్తి కొరకు ఏమేమి కావాలో అవి కావలసిన పరిమాణములో అన్ని లభించినపుడు వ్యర్థముగా సిద్ధి సాధనా ప్రయత్నము ఎందుకు చేయాలి?

ఋద్ధి విశుద్ధ ఆత్మికము. దాని గురించి ఇతరులకు చెప్ప వలసిన అవసరమేలేదు. ఎవరూ దానిని చూడలేరు, తెలుసుకొనలేరు, పరిక్షించలేరు. అవి నాకు లభ్యము అయ్యాయి. మూగవాడు బెల్లమును నిరంతరము అస్వాదిస్తున్నట్లు నేను వాటిని నిరంతరము అనుభవము చేస్తూ ఆనందమగ్నుడన్నయ్యే పరిస్థితులు నిరంతరం లభిస్తూనే ఉన్నాయి.

సిద్ధ పురుషులకు స్వర్గము, ముక్తి అనే దైవీ అనుదానాలు లభిస్తాయి. స్వర్గము ఒక స్థానము అని లోక విశేషము అని నేను ఎప్పుడూ నమ్మలేదు. స్వర్గము ఉత్కృష్ట దృష్టి కోణము. నేను చేసే ప్రతి

కృత్యములో ఉత్కృష్టత, ఆదర్శము కలసే ఉంటుంది. సర్వత్రా ఈశ్వర సంప్రాప్తియే దృష్టి గోచరమంతుంది. ఈ ఆనందమునే స్వర్గము అంటారు. అది నాకు నిరంతరము లభిస్తుంది. దుశ్చింతన,దుష్కర్మల స్పర్శయేలేనపుడు నరకము ఇంక ఎక్కడ ఉంటుంది?

ముక్తి భవబంధనాలనుంచి లభిస్తుంది. వాసన, తృష్ణ, అహంతను భవసాగరము అన్నారు. లోభము చేతికి సంకేళ్ళని, మోహము కాళ్ళకు పడే సంకేళ్ళని, గర్వమును మేడకి వేసే బరువు అని అంటారు. జీవుడు దీని ద్వారా బంధిపబడి ఉంటాడు. నా శిరస్సు మీద గురుదేవుల దిశానిర్దేశనము దానిని కార్యాన్వయము చేసేప్రయత్నాలు ఎలా ఎక్కి ఉంటాయి అంటే ఈ మానసిక శత్రువులను పిలిచి వారి నిమిత్తము ఏదో చేయడానికి సమయమే లేదు. ముక్తి కొరకు ఇతరులు తమ మృత్యువు కొరకు ప్రతిక్షించాలి. కాని నాకు జీవనము, మరణము ఒకే లాంటిది. ఏ కారణము వల్ల జీవన్ముక్తి ప్రియముగాను మరణము అప్రియముగాను అనిపిస్తున్నదో ఆ భేధ భావాలు జీవన్-సాధనతోనే తిరోహితమైపోయాయి.

ఋద్ధి అంతరికము. స్వానుభుతివరకే దాని అవధి. ఆత్మ సంతోషము, లోకసమ్మానము, దైవీ అనుగ్రహము ఈ మూడింటిని దివ్యఅనుభవాలు అంటారు. ఇవి నాకు నిరంతరము అనుభవములోకి వస్తూనే ఉంటాయి. అభావముల వల్ల అసంతోషము ఉంటుంది. కుకర్మములతో ఆత్మ ప్రతాడన ఉత్పన్నము అవుతుంది. ఈ రెండు నాకు లేవు కనుక ఇక అసంతోషము ఎలా ఉంటుంది? కర్తవ్యము దాని పరిపాలన, ఆదర్శాలకి సమగ్ర సమర్పణ చేసిన తరువాత ఎవరికి కూడా అసంతోషజన్య ఉద్వేగము కలుగదు. నాకు కూడా వాటిన సహించ వలసిన పరిస్థితి రాలేదు. ఇక ఇప్పుడు శరీరము యొక్క వయస్సు వల్ల వచ్చిన వివేకమే కోరికలకు సమాధానము చెబుతుంది. అందువల్ల అభావము లేదు, అసంతోషము లేదు.

లోకసమ్మానము రెండవ ఋద్ధి. దీని కొరకు వేరుగా ఏమి ప్రయత్నము చేయవలసిన అవసరము రాలేదు. మనస్ఫూర్తిగా నేను ప్రతి ఒక్కరికి సమ్మానము ఇస్తూ సహకరించాను. స్నేహ సద్భావములు అన్ని వైపుల వేదజల్లాను. సంపర్కములోకి వచ్చిన వారిని అందరిని ఆత్మీయతా బంధనాలతో కట్టి పడవేసాను. దాని ప్రతిక్రియ అద్దములోని ప్రతిబింబము వలె, ప్రతి ధ్వని వలే లభించింది. రబ్బరు బంతిని ఎంత గట్టిగా గోడకు విసురుతామో అంతే వేగముతో తిరిగి వస్తుంది. నా స్నేహము సమ్మానము ఇతరుల మనస్సుతో ఢీకొని అదే పరిమాణాములో నాకు వెనక్కి తిరిగి లభించింది. నేను ఎవరిని శత్రువుగా భావించలేదు. ఎవరి గురించి నా మనస్సులో దుర్భావము రాలేదు. అందువల్ల ఇతరుల మనస్థితి ఎలా ఉన్నా నాకు మాత్రము దాని అనుభూతి సధ్భావనలతో నిండి ఉన్నది అనిపించేది. నా జీవితము చివరి క్షణాలలోకి వచ్చినది. ఎవరన్న నీకు విరోధులు, శత్రువులు, భాధ కలగచేసేవాళ్ళ పేరు చెప్పమంటే ఒక పేరు కూడ చెప్ప లేను. ఎవరైన తెలియక హాని కలుగ చేసినా వారిని దారి తప్పిన బాలబుద్ధి కలవారిగానే భావించాను. నేను ప్రతి ఒక్కరికీ సమ్మానము ఇచ్చాను. అదే నాకు తిరిగి లోక సమ్మానముగా లభించింది. ఎవరైన అలా సమ్మానము ఇవ్వకపోతే దానిని కూడా ఒక పరిక్షగా, సమిక్షగా హితకామన అనే అనుకున్నాను.

మూడవ ఋద్ధి దైవీ అనుగ్రహము. దీనిని ఉచ్చస్తరీయ క్రియా కలాపాలద్వారా మరియు వాటి సాఫల్యము ద్వారా గుర్తించాలి. ఇంతే కాక ఆకాశములోని నక్షత్రాలు, మొక్కలలో వికసించిన పూలు,

మేఘాలనుంచి వర్షిస్తున్న జలబిందువులు, గాలికి కదులుతున్న ఆకులు, నదులలోని అలలు, పక్షులయొక్క కలకలారావాలు నాకు తమ ప్రేమను అందిస్తున్నాయి అనిపిస్తుంది. పుష్పవృష్టి కురిపిస్తున్నాయి అనిపిస్తుంది. దేవతలు పుష్పములను కోసి, తృంచి వాటి మోసి ఆకాశము లోనికి తీసుకొని వెళ్ళి పుష్పవృష్టి కురిపించే కష్టము ఎందుకు చేస్తారు? ప్రకృతి యొక్క కణకణములో, ప్రాణులయొక్క కదలికలో, వనస్పతులయొక్క సౌందర్యములో ఆనందము పొందగలిగే వారికి ప్రపంచమే పువ్వులతో నిండి ఉండటము కాక వీరు ప్రపంచాన్ని కూడా పుష్పాలతో నింపేస్తారు.

నాకు లోపల, బయట ప్రతి చోట ఉల్లాసమే, ఉత్సాహమే పొంగిపొరలుతూ కన్పిస్తుంది.జీవితాన్ని ఎన్ని రకాలుగా తిప్పిచూసినా చందనము యొక్క సుగంధమే కనిపిస్తుంది. నా గడిచిన కాలాన్ని మెడ తిప్పి వెనక్కి చూస్తే చాలా గొప్ప జీవితము జీవించాను అని అనిపిస్తుంది. వర్తమానాన్ని చూస్తే నిరంతర ఉత్సాహా స్రవంతి ప్రవహిస్తూ కనిపిస్తుంది. సదూర భవిష్యత్తులో దృష్టి పెట్టినపుడు భగవంతుని దర్బారులో ఒక అపరాధిగా నించోవలసివస్తుంది అని అనిపించదు. అక్కడ పరిక్షలో మంచి మార్కులు తెచ్చుకొన్న విద్యార్థి వలె గెలచిన ఆటగాడికి లభించే బహుమతులే నాకు లభిస్తాయన్న నమ్మకము ఉంది.

నా ఆత్మ నన్ను ఎప్పుడూ చెడ్డ వాడివి అని అనలేదు. ఇంక ఇతరులను నన్ను ఎందుకు అలా అంటారు? ఎవరు ఏమి అన్నా తమస్థితి యొక్క వ్యాఖ్య తమ నోటితోనే చెప్పుకుంటున్నారు. నాకు ఇతరులను ప్రశంసించడము వారికి మర్యాద ఇవ్వడమే ఇష్టం. ఇక లోక, పరలోకములో నాకు అవే లభిస్తాయి కదా? ఇంతకంటే ఎక్కువ మానవ జీవితము యొక్క సార్థకత ఏమి ఉంటుంది.

ఆత్మ సాధన చేసేవారు లభించిన ఋద్ధి, సిద్ధులను బట్టి వారి సఫలత, అసఫలత నిర్ణయించుకొంటారు. నాకు దీని కొరకు వేరుగా ఏమి ప్రయత్నము చేయవలసిన అవసరము రాలేదు. నేను బాహ్య జగత్తుకు ఏమి అందచేసానో నాకు తిరిగి అదే లభించింది.

ఈశ్వరుని నేను విరాట్ బ్రహ్మగా దర్శించాను. విశ్వమానవునిగా నేను అతనిని ఒక క్షణము కూడా వదలి పెట్టలేదు. అతను కూడా ఎప్పుడూ నన్ను ఒంటరిగా వదలిపెట్టే నిష్టూరత చూపించలేదు. ఎక్కడ వార్తాలాపము జరిగినా దెబ్బలాట తప్పలేదు. రాముడు, భరతుడు రాజసింహాసనాన్ని బంతిలాగా ఆడుకున్నారు, దెబ్బలాడుకున్నారు. ఏమని? నేను తీసుకోను, నీకు ఇస్తాను అని. భగవంతునితో నాకు కూడా ఇటువంటి దెబ్బలాటే నిరంతరము జరుగుతుంది. ఆయనతో నిరంతరము నేను ఒకటే అంటున్నాను. నీకు ఏమి కావాలి, నేను ఇస్తాను. డోమ్ లో ఏవిధముగా ప్రతిధ్వని వస్తుందో నిరంతరము నా జపము ఏమిటంటే నీకు ఏమి కావాలి? నీ మనోరథము చెప్పు. నేను దానిని పూర్తి చేసుకొని ధన్యుడ్ని అవుతాను.

భగవంతుడు నాకు అంగరక్షకుడు వలే వెనుక ముందు నడుస్తు సంరక్షిస్తు ఉన్నాడు. పైలెట్ వలే ముందుముందు నడచి దారి చేస్తూ ఉంటాడు. నా యొక్క అంకితమైన ఈ శరీరము–ఉడుత వలే ఆయనకి సర్వతో భావేన సమర్పణ చేసుకుంది.

పూజ్య గురుదేవులు వేదమూర్తి తపోనిష్ఠ యుగద్రష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్య ద్వారా ప్రణీతమైన

# జీవన దేవతా సాధన

(ఒక విశిష్ట వైజ్ఞానిక ఆధ్యాత్మ విద్య)

ఆధ్యాత్మిక జీవితానికి మూడు మెట్లు ఉన్నాయి.

**1. మాతృవత్ పరదారేషు,**

**2. పరద్రవ్యేషు లోష్టవత్,**

**3. ఆత్మవత్ సర్వభూతేషు.**

ఈ మూడింటిని అధిరోహిస్తూ సుదూర లక్ష్యాలను పొందాలి.

పండిత శ్రీరామశర్మ ఆచార్య వాంఙ్మయము-1

పేజి 1.1 నుండి 1.17 వరకు